నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
ఆదివారం 21 జులై 2024 పేజీలు 8




## హత్యా సంస్కృతి జగన్‌రెడ్డిదే

**శవ రాజకీయాలపై పుట్టిన వైకాపా**
**ఏ మొహం పెట్టుకుని ఢిల్లీలో ధర్నా**
**అసెంబ్లీకొచ్చి ప్రజాపయోగ చర్చల్లో పాల్గొను**
**మీ అరాచక పాలనకు దేశ బహిష్కరణ చేయాలి**
**వక్రబుద్ధి మార్చుకోకపోతే ప్రజలే తరిమికొడతారు**
**మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపాటు**

సూర్యప్రతినిధి, ఒంగోలు

హత్యలతో పాటు శవరాజకీయాలు చేసే సంస్కృతి జగన్‌రెడ్డిదని, శవరాజకీయాలపై పుట్టిన వైకాపాదేనని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. శనివారం సిఎం నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యక్తిగత కారణాలతో మిగతా 3లో

## విభజనపై తొలి అడుగు


**ఉమ్మడి ప్రకాశం జిల్లా విభజనపై చర్చలకు సిద్ధమైన ప్రజాప్రతినిధులు**
**మార్కాపురం జిల్లాగా, ప్రకాశంలోకి అద్దంకి, కందుకూరు**
**ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబునాయుడు**
**అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించనున్న ప్రజాప్రతినిధులు**
**ఆరు నెలల్లో పరిష్కరించాలనే కోణంలో ప్రజాప్రతినిధులు**
**సమావేశాల సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు వివరించనున్న నేతలు**

సూర్యప్రతినిధి, ఒంగోలు

జిల్లా విభజనపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని పూర్తి చేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి ప్రాతిపదిక లేకుండా కేవలం పార్లమెంట్ నియోజకవర్గం ఆధారంగా విభజన చేస్తున్నామని చెప్పి ఇష్టారీతిన ఉమ్మడి ప్రకాశం జిల్లాను ముక్కలు చేశారు. దీంతో జిల్లాతో అవినాభావ మిగతా 3లో




అశాస్త్రీయంగా అసంబద్ధంగా చేసిన నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలను వంద కిలోమీటర్ల దూరంలో పడేశారు. ఏపని చేయాలన్నా, ఏ సమస్య విన్నవించుకోవాలన్నా జిల్లా అధికార యంత్రాంగం అందుబాటులో లేదు. కొందరు రాజకీయ నాయకులు ప్రయోజనాల కోసం ప్రజల ఆకాంక్షలను, అవసరాలను పక్కపెట్టి వైకాపా ప్రభుత్వంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాను ముక్కలుగా చేశారు. ఎన్నికల సమయంలో జిల్లా విభజనపై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని నారా చంద్రబాబు నాయుడు ప్రకటనతో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం ఆ కళను నెరవేర్చేందుకు తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతుండటంతో ఉమ్మడి ప్రకాశంలో విభజన సమస్యలు దూరం కానున్నాయి.



## సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

**దోమకాటు వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలి**
**గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలి**
**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, సంబందిత శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకం అని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుతో కలసి డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య భద్రతపై సంబంధిత శాఖల అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా



సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలతో మిగతా 3లో

## ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

**బాపట్ల ప్రాంతీయ వైద్యశాలను సందర్శించిన కలెక్టర్**
**అందుతున్న వైద్యసేవలపై రోగుల వద్ద ఆరా**
**రోగుల సహాయకులు వేచి ఉండేలా షెడ్ ఏర్పాటు**

బాపట్ల, మేజర్‌న్యూస్: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగుల పేర్ల నమోదు, ఓపి, ఇంజక్షన్ వేసే గది, హెచ్ఐవి కౌన్సిల్ గదులు, ఎక్స్‌రే, స్కానింగ్ గదులు, చిన్నపిల్లల వార్డు, కాన్పులు, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. బ్లడ్ స్టోరేజ్ యూనిట్, పురుషుల వార్డు, స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్, మిగతా 3లో





## మహిళలు, పిల్లల భద్రతకు పెద్దపీట

**అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం**
**జిల్లా నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరికలు**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ ఒంగోలులో స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఎస్పీ ఒంగోలులోని మహిళా స్టేషన్‌ని తనిఖీ అనంతరం అక్కడి పిర్యాదుదారులతో మాట్లాడుతున్న క్రమంలో ఒంగోలుకు చెందిన బాధితురాలు ఒక ఆక తాయి తన కుమార్తెతో (10) అసభ్యకరంగా మిగతా 3లో

## కొత్త సాంప్రదాయమా... రహస్య సమావేశమా..?





3 లో...

## స్పా సెంటర్లపై మెరుపుదాడులు

**సెంటర్లలో పోలీస్ బృందాల ముమ్మర తనిఖీలు**
**అక్కడి సిబ్బంది వివరాలు సేకరించిన పోలీసులు**





3 లో...

## వైద్య ఖర్చులకు సాయం చేసిన ఆదర్శ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఒంటిపై వేడి సాంబార్ పడి ఒంటికి తీవ్ర గాయాలు పాలైన బాలుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు.బాపట్ల పట్టణం చీల్ రోడ్డు ప్రాంతానికి చెందిన 8 సంవత్సరాల హుస్సేన్ భాష ఒళ్ళు కాలి ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలుడికి రూ 5000 ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా సహాయం చేయాలని కోరిన మేరకు ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశామని బాలుడికి మరికొంత మంది సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల సురేష్, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, సభ్యులు యాసం రాజా రమేష్, విన్నకోట శ్రీనివాసరావు, ఓటికుండల లక్ష్మణ రావు, చామర్తి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## రక్షణ సైన్య ప్రార్థన మందిరంలో ఆదరణ కార్యక్రమం



బాపట్ల, మేజర్‌న్యూస్: రక్షణ సైన్యము బాపట్ల విద్యా నగర్ సేన స్థానంలో శనివారం రక్షణ సైన్యము ఆంధ్రప్రదేశ్ లో స్థాపించబడినటువంటి దినమును పురస్కరించు కొని బాపట్ల మండల నాయకులైన లెఫ్టినెంట్ కల్నల్ గేరా తామస్ డివిజనల్ కమాండర్, లెఫ్టినెంట్ కల్నల్ గేరా సియోను కుమారి విద్యానగర్ రక్షణ సైన్య సంఘ పెద్దలు కమిటీ వారు గృహ సమితి స్త్రీలు యవనస్థులు బాపట్ల మండలంలో 34 సంఘాలలో దేవుని సేవ చేస్తున్నటువంటి దైవ సేవకులు అందరూ కూడా పాల్గొని రక్షణ సైన్య ధ్వజమును ఎగ్గరవేసి సంఘములు ఉజ్జీవం కొరకై ఉద్యోగస్తుల బైక్ ర్యాలీ ఏర్పాటు చేయబడినది ఉద్యోగస్తుల బైక్ ర్యాలీ కూడా దీనిలో భాగంగా రక్షణ సైన్య ప్రార్థన మందిరం విద్యానగర్ లో ఆరాధన కార్యక్రమము జరిగింది. స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్, స్టాఫ్ కెప్టెన్ రమాబాయి 1895 సంవత్సరంలో విజయవాడ ముఖ్య కేంద్రముగా రక్షణ సైన్యము ప్రారంభించబడినది ఇప్పటికీ 134 దేశాల్లో రక్షణ సైన్యము దిగ్విజయముగా పని చేయుచున్నది రక్షణ సైన్యము సాంఘిక సేవ విద్యా సేవ వైద్య సేవ, సువార్త సేవను చేస్తూ అనేకులకు తోడ్పడుతున్నది. ఈ కార్యక్రమంలో విద్యానగర్ లోకల్ ఆఫీసర్ కమిటీ వారు యవనస్థులు గృహ సమితి స్త్రీలు చిన్న బిడ్డలు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని రామన్నపేట పంచాయితీ ఆంటోని లెప్రసీ కాలనీలో నివసిస్తున్న పేదవారికి శనివారం మధ్యాహ్న భోజనం, దుప్పట్ల పంపిణీ చేయడం జరిగినది. పందిళ్ళపల్లికి చెందిన నరాల శెట్టి సత్యనారాయణ, సత్యవతి వారి కుమార్తె లీలా ప్రసన్న తరపున వారి కుటుంబ సభ్యులు లెప్రసీ కాలనీలోని సుమారు 60 మందికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. తదుపరి 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరాల శెట్టి సత్యవతి, బండ్ల బాబు, యారాసు అరుణ్ బాబు, కర్ణ కుమార్ స్వామి, జోషి తదితరులు పాల్గొన్నారు.

# సరసమైన ధరలకు సరుకులు అందిస్తున్న దుకాణాల తనిఖీ

బాపట్ల, మేజర్‌న్యూస్: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు ఎం. మాధురి లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రీజినల్ హెడ్ నెల్లూరు నుంచి గుంటూరు, ఈ బి విలియమ్స్ బాపట్ల జిల్లా పౌర సరఫరాల అధికారి, కె. ఇసాక్ జిల్లా కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ, పి లిల్లీ అసిస్టెంట్ కంట్రోలర్, పి నాగేశ్వరరావు అసిస్టెంట్ మేనేజర్ ఏపీ ఎస్ సి ఎస్ సి లిమిటెడ్, బి రాందాస్ ఇన్స్పెక్టర్, దాసరి ఇమ్మానియేల్ డిసిఐసి కన్వీనర్ సంయుక్తంగా బాపట్ల పట్టణంలోని రిలయన్స్ మార్ట్ లో తనిఖీ చేశారు . అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నందు తనిఖీ నిర్వహించి మాట్లాడుతూ జిల్లా పౌర సరఫరాల అధికారి బియ్యము, కందిపప్పు నకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ల యందు నిత్యము పరిశీలించి లబ్ధిదారులకు బియ్యము, కందిపప్పు ఉదయము 7:00 ల నుండి సాయంత్రము 8:00 గం.ల వరకు ప్రత్యేక కౌంటర్ ఓపెన్ చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లబ్ధిదారులకు అమ్మే విధముగా చర్యలు తీసుకోవాలని ఆదేశంచారు. ప్రత్యేక కౌంటర్ల గురించి అవగాహన కల్పించాలని అన్ని విధములుగా ప్రచారం చేయా



లని అంతే కాకుండా ప్రత్యేక కౌంటర్లలో తగిన స్టాక్ నిల్వలు అందుబాటులో ఉంచాలన్నారు. తదుపరి సివిల్ సప్లయిస్ శాఖ కు సంబంధించి పిడిఎస్ బియ్యము అక్రమముగా తరలిస్తున్న వారిపై అవక తవకలు పల్పడుచున్న చౌక దుకణదారులపై 64 కేసులు నమోదు చేయవలసినదిగా అలాగే పిడిఎస్ పంపిణి జిల్లాలో తక్కువ శాతము నమోదు అవడానికి గల కారణాలు తెలుసుకొని ఎక్కువ శాతము నమోదు అయ్యే విధముగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సైక్లోన్ సమయములో సైక్లోన్ కు ఎఫెక్ట్ అయ్యే గ్రామాలకు సంబంధించి రేషన్ షాపులకు అడ్వాన్సు స్టాక్స్ త్వరగా షాపులకు చేరేల చర్యలు తీసుకోవాలని కోరారు.లీగల్ మెట్రాలజి శాఖా వారిని నిత్యము దుకాణములు చౌక దుకాణములు పరిశీలించి కొలతలలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా వినియోగ దారుడు నష్ట పోకుండా టోల్ ఫ్రీ నెం. ను ఏర్పాటు చేసి వినియోగ దారులకు అందరికి తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.పౌర సరఫరాల కార్పొరేషన్ వారికి యం.యల్.ఎస్ పాయింట్ నుండి నిత్యావసర వస్తువులు నిర్ణీత సమయములో చౌక దుకణములకు నిత్యావసర వస్తువులు చేరు విధముగా లిఫ్టింగ్ సమయములో రవాణలో కొరత లేకుండా ప్రభుత్వము నిర్ణయించిన వాహనములు అన్నియు వినియోగించి నిత్యావసర వస్తువులు నిర్ణీత సమయ ములో చేరు విధముగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో బియ్యము, కందిపప్పు అమ్మకాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ను సందర్శించి కౌంటర్‌లో ఉన్న స్టాక్ క్వాలిటీని పరిశీలించమని టెక్నికల్ టీం వారికి తగిన సూచనలు ఇచ్చారు. సైక్లోన్ సమయము లో సైక్లోన్ కు ఎఫెక్ట్ అయ్యే గ్రామాలకు సంబంధించి రేషన్ షాపులకు అడ్వాన్సు స్టాక్స్ త్వరగా చేరేల ఎం. ఎల్.ఎస్ పాయింట్ ఇన్ ఛార్జ్ లు పని చేయాలని అన్నారు.

## పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్ను, పెన్సిల్ వితరణ

బాపట్ల, మేజర్‌న్యూస్: గురుపూర్ణిమ పురస్కరించుకొని భావపురి బ్రాహ్మణ సమాఖ్య బాపట్ల వారి ఆధ్వర్యంలో రెల్లి కాలనీ, రైలుపేట బాపట్లలో చదువుకుంటున్న 100 మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షులు నిభానుపూడి శ్రీహరి ప్రకాష్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు, క్రమశిక్షణగా మెలుగుతూ, అన్ని సౌకర్యాలు గల ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఉన్నత చదువులతో పైకి రావాలని కోరారు అనంతరం విజయలక్ష్మిపురంలో శ్రీ సీతారామ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థినీ విద్యార్థులకు, మరుప్రోలువారి పాలెం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు కూడా భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో భావపురి బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు శ్రీహరి ప్రకాష్, సోమరాజు శ్రీనివాస్, కొలను మోహన్, శ్రీకాంత్, రామారావు, హనుమంతరావు, శ్రీరామ శర్మ, షణ్ముఖ, గూడా భట్టుశర్మ, శ్రీరామచంద్రమూర్తి, రాంగోపాల్, సుబ్బరామయ్య, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నాక్ బృందం సందర్శన

బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల లో రెండు రోజులు నాక్ బృందం సందర్శించారు. మొదటి రోజు సందర్శనలో భాగంగా నాక్ బృందం ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ ఎడిట్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కళాశాల యాజమాన్యం వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ బృందానికి డాక్టర్ వైదేహి విజయ్ కుమార్ అధ్యక్షతగా వ్యవహరించారు. నాక్ బృందం కళాశాలలోని అన్ని విభాగాలను, కాలేజీ మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పూర్వ విద్యార్థినిలు, తల్లిదండ్రులు, కళాశాల విద్యార్థులు అధ్యాపకులతో చర్చించి వారి సలహాలను సూచనలను పరిగణలోనికి తీసుకున్నట్టు తెలిపారు. నాక్ బృందం పరిశీలనలో భాగంగా ఎగ్జిట్ మీట్లో వారి అమూల్యా మైన సలహాలు, సూచనలు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఐక్యు ఎ సి కోఆర్డినేటర్, విభాగపతులు, అధ్యాపకులతో పంచుకున్నారు. వారి బృందం యొక్క నివేదికను కళాశాల ప్రిన్సిపాల్ కి అందజేశారు. కళాశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలియ



జేసింది. అనంతరం విద్యార్థినిల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనతో అలరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ 1.డి. రామ్మోహన్ రావు , వైస్ ప్రెసిడెంట్ 2.గెల్లి దిలీప్ కుమార్, సెక్రెటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కె. హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి. రామకృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు, విభాగపతులు అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## జవాబుదారీతనం కోసమే సమాచార హక్కు చట్టం

నగరం, మేజర్‌న్యూస్: అధికార యంత్రాంగంలో పారదర్శకంగా, జవాబుదారీతనం తీసుకువచ్చేందుకు, వాటి ఆధీనంలోని సమాచారాన్ని అవసరం మేరకు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాజ్యాంగంలో చట్టబద్ధం చేశారని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్‌హుస్సేన్ అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్‌హుస్సేన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పౌరులందరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి వుంటే ప్రభుత్వాలు, అందులో పనిచేసే ఆయా శాఖలు సక్రమంగా పనిచేస్తాయన్నారు. అవినీతిని అరికట్టేందుకు, ప్రజలకు జవాబుదారీగా ఉంటారన్నారు. మండల డిప్యూటీ తహశీల్దారు ఎం. శ్రీనివాసరావు



మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రజలు ఎలా వినియోగించుకోవాలో, ఫిర్యాదు తీసుకున్న అధికారులు ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో తెల్పుతూ ఆ చట్టంలోని పలు సెక్షన్లను వివరించారు. సమావేశానికి మండల వ్యవసాయాధికారి వి. రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. చక్రపాణిప్రసాద్, తెలుగుదేశం నాయకుడు లుక్కా గుడారంకయ్య, మండల పరిధిలోని ఆయా శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శిక్షణా తరగతులు



బాపట్ల, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం పశువుల రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సక్రమంగా వారికి చేరేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం హనుమంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం చీరాల డివిజన్ పరిధిలోని పశు వైద్యాధికారులు, ఆరోగ్య మిత్ర, వెటర్నరీ అసిస్టెంట్లకు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మినీ గోకులాలపై రైతులకు అవగాహన కలిగించి వారికి దరఖాస్తు విషయములో సహకరించాలని కోరారు. సెప్టెంబర్ నుండి జరగనున్న 21వ పశుగణన సక్రమంగా జరగాలని, దీనికి సిబ్బంది కృషి ఎంతో అవసరమని కోరారు. పశువుల మేత కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై జొన్న విత్తనాలపై రైతులకు తెలియజేసి భవిష్యత్తులో పశుగ్రాస కొరత రాకుండా చూడాలని సిబ్బందిని కోరారు. సిబ్బందికి అవగాహన తరగతులకు రిసోర్స్ పర్సన్స్ గా ఒంగోలు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ రమేష్ బాబు, మార్టూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పివి నరసింహారావు, అద్దంకి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ రావు లు సిబ్బందికి వివిధ కార్యక్రమాల పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, అద్దంకి, కొరిశపాడు, సంతమాగులూరు, మండలాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్లు డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.



# విభజనపై తొలి అడుగు

**మొదటి పేజీ తరువాయి** సంబంధం కలిగిన పలు ప్రాంతాల ప్రజలు తమను అన్యాయంగా ఇతర జిల్లాలకు పంపడం వలన తమ ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడుతాయని చెప్పినా నాటి వైకాపా ప్రభుత్వం పట్టించు కోలేదు. జిల్లాలోని మార్కాపురం వాసులు తమకు ప్రత్యేక జిల్లా కావాలని, ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు కేవలం 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న అద్దంకి, కందుకూరును సుమారు 100 కిలోమీటర్ల పైన ఉన్న బాపట్ల, నెల్లూరు జిల్లాలో కలపడంపై అన్ని వర్గాల ప్రజలు వైకాపా ప్రభుత్వ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. వేల సంఖ్యలో వినతులు అందజేశారు. కానీ వీటిని పట్టించుకోని వైకాపా ప్రభుత్వం శాస్త్రీయంగా కాకుండా తమ పార్టీ నాయకుల ప్రయోజనాల కోసం జిల్లాను విభజన చేసింది.

### విభజన సమస్యల పరిష్కారానికి సిద్ధమైన ప్రజాప్రతినిధులు

2024 ఎన్నికల సమయంలో మార్కాపురం, అద్దంకి, కందుకూరు ప్రాంతాల్లో పర్యటించిన నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దృష్టికి ఆ ప్రాంతాల వారీతో పాటు జిల్లావాసులు విభజన సమస్యను తీసుకువెళ్లడం, జిల్లా మార్పు వలన తమకు జరుగు తున్న నష్టాన్ని వివరించారు. ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా విభజన విషయంలో తలెత్తిన సమస్యల పరిష్కారంతో పాటు మార్కాపురం జిల్లాగాను, అద్దంకి, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని తెలిపారు.

ఈ ప్రాంతాల నుంచి పోటీచేసిన టిడిపి అభ్యర్థులు సైతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో విభజన సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన నెలరోజులు అవుతుండటంతో పాటు ఈనెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లేందుకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కందల నారా యణరెడ్డి, అశోక్‌రెడ్డితోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు ఈ విభజన సమస్యపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మార్కాపురం జిల్లా ప్రకటనతో పాటు అద్దంకి, కందుకూరును పూర్వ ప్రకాశం జిల్లాలోకి తీసుకువచ్చేలా ముఖ్యమంత్రి వద్ద ప్రతిపాదించి ఆ సమస్యను పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనెల 22 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా విభజన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లే ఆలోచనలో ఉండటంతో ప్రజలకు ఇచ్చిన మాటకు తొలి అడుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి



**మొదటి పేజీ తరువాయి** ల్యాబ్, ఐసియు, ఔషధాల నిల్వ కేంద్రం, అత్యవసర విభాగాలను పరిశీలించారు. ఆయా వార్డులలో వైద్యం పొందుతున్న రోగులతో ఆయన స్వయంగా మాట్లాడారు. వైద్యం సక్రమంగా జరుగుతుందా డాక్టర్లు బాగా చూస్తున్నారా సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా లేదా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అంటూ రోగులతో మాట్లాడుతూనే ఆరా తీశారు. ఆస్పత్రిలో బెడ్ల సామర్థ్యం, ప్రతిరోజు సగటున నమోదయ్యే ఓపీలు, వైద్యం కొరకు ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య, అత్యవసర విభాగంలో సేవలు, ఆపరేషన్‌లు జరుగుతున్న తీరు, ఔషధాల నిల్వలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోగుల వెంట వచ్చిన వారి బంధువులు వేచి ఉండడానికి ఎలాంటి సౌకర్యం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోను మాట్లాడారు. వర్షాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికే ప్రభుత్వ వైద్యశాలలు నడుస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలలో 400కు పైగా ఓపీలు నమోదవుతున్నాయని చెప్పారు. ఏడు విభాగాలలో ఓపీలు నడుస్తుండగా, అత్యవసర సేవలు, ఆపరేషన్ల కొరకు సగటున ప్రతిరోజు నాలుగు నుంచి ఐదు వరకు బ్లడ్ ప్యాకెట్లు వినియోగిస్తున్నామన్నారు. ప్రస్తుతం బ్లడ్ స్టోరేజ్ విభాగంలో 49బ్లడ్ ప్యాకెట్లు ఉన్నాయని, వాటి సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు సగటున 80 మందికి ఎక్స్ రేలు తీస్తున్నామని చెప్పారు. ఈ విభాగంలో కొంత సిబ్బంది కొరత ఉందన్నారు. రోగుల వెంట వచ్చిన వారు వేచి ఉండడానికి అవసరమైన షెడ్ ఏర్పాటుచేస్తామన్నారు. నిధులను సమీకరించి తక్షణమే చర్యలు తీసుకుంటామని లేదా దాతల సహాయంతో సత్వరమే ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన వారంతా ఆరోగ్యవంతులై తిరిగి వెళ్లడమే లక్ష్యంగా డాక్టర్లు పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన వైద్యం సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రక్త దాన శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. రక్తం నిల్వలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20పడకల స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ జిల్లాలో సమర్థంగా నడుస్తుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులు అనారోగ్యానికి గురైతే ప్రత్యేక యూనిట్‌లో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుల వ్యవధిలో జన్మించిన ఏడుగురు శిశువులు ఇక్కడ వైద్యం పొందుతున్నట్లు వివరించారు. ఐసియు విభాగం బాగా నడుస్తుందన్నారు. ప్రాంతీయ వైద్యశాలలో మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రోగులతో మాట్లాడినప్పుడు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, వైద్యుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన విషయాలను తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్, అక్కడకు చేరుకున్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, తదితరులు ఉన్నారు.

# మహిళలు, పిల్లల భద్రతకు పెద్దపీట

**మొదటి పేజీ తరువాయి** ప్రవర్తించగా మరొక వ్యక్తి తన భర్తపై దాడి చేసి పారిపోయినట్లు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అంతటా ఎస్పీ సదరు ఫిర్యాదును సావధానంగా విని వెంటనే సీసీఎస్ పోలీసులను రంగంలోకి దించగా వారు తక్షణ దర్యాప్తు చేసి గాలింపు చర్యలు చేపట్టి స్వల్పకాల వ్యవధిలోనే ఒంగోలులోని వంటవారి కాలనీకి చెందిన మిట్ట అనిల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సదరు ఫిర్యాదుపై ఒంగోలు టూ టౌన్ పోలీస్ అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో సదరు వ్యక్తి ఒంగోలు వన్ టౌన్ పీఎస్‌లో చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనిపై రౌడీ షీట్ తెరవడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా మహిళలు, పిల్లలుపై అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో మహిళలు, పిల్లల భద్రతకు వారిపై నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కొత్త సాంప్రదాయమా... రహస్య సమావేశమా..?



కనిగిరి, మేజర్‌న్యూస్: ప్రతి మున్సిపల్ సమావేశానికి పత్రికా విలేకరులను ఆహ్వానించే వారు. మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలోని సమస్యలను ప్రశ్నల రూపంలో అడిగిన వాటికి అధికారులు లేదా మున్సిపల్ చైర్మన్ గాని ఇచ్చే సమాధానాలను ప్రజలకు చేరవేయడం ఆనవాయితీ. అయితే శనివారం జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశానికి మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్యెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి యధావిధిగా విలేకరులు హాజరయ్యారు. అయితే సమావేశం నిర్వహణలో జీరో అవర్ కూడా ఉంటుందని అజెండా చదివి వినిపించిన తర్వాత సభ్యులు సమస్యలపై చర్చించేటప్పుడు పాత్రికేయులను అనుమతిస్తామని ఎమ్యెల్యే సూచన మేరకు కమిషనర్ రంగారావు తెలియజేయడంతో సమావేశం నుంచి వెనుతిరిగారు.

కొద్దిసేపు అనంతరం విలేకరులు రావాలని పిలుపు ఇవ్వడంతో పాత్రికేయులు సమావేశానికి వెళ్లారు. అక్కడికి వెళ్ళగానే సమావేశం అయిపోయిందని ఆ వివరాలను మున్సిపల్ చైర్మన్ వివరిస్తారని పొంతన లేని సమాధానాలతో దాటవేయడంతో చివరకు సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ చెప్పిన వివరాలు మాత్రమే నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా కౌన్సిలర్లు తమ సమస్యలను ప్రస్తావించినప్పుడు వాటికి లభించే సమాధానాలు ప్రజలు పత్రికల ద్వారా తెలుసుకుంటుండగా ఆ అవకాశం లేకపోవడంతో ఈ సమావేశం రహస్య సమావేశంగా మారిందని అక్కడకు వచ్చిన వారు గుసగుస లాడుకోవడం విశేషం.

# సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి




**మొదటి పేజీ తరువాయి** పాటు సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకం అన్నారు. గ్రామ, పట్టణ స్థాయిలో వైద్యారోగ్య, ప్రజారోగ్య, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది బాధ్యతగా, విధిగా పనిచేస్తేనే ప్రజారోగ్య భద్రత సాధ్యం అవుతుందన్నారు. సంబందిత అధికారులు తప్పకుండా ప్రతిరోజు విధులకు హాజరవుతూ క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై ఏఎన్‌ఎం, ఆశ, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగు సూచనలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రతిరోజు డ్రై డే అమలు జరిగేలా మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్, తహసిల్దార్లను, డివిజన్ అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే పిల్లల శుభ్రత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు వ్యక్తిగత పారిశుధ్యం, పోష్టికాహార ఆహారపు లావాట్ల గురించి తెలియజే యాలన్నారు. మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు, డివిజన్‌స్థాయిలో డివిజన్‌స్థాయి అధికారులు ఈ విషయాలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ సిఈఓ మాధురి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సురేష్‌కుమార్, ఆర్.డబ్ల్యూ.ఎస్. ఎస్‌ఈ మర్దన్ అలీ, సాంఘిక సంక్షేమ సఖ డిడి లక్ష్మానాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజన, వివిధ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయిలో డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# స్పా సెంటర్లపై మెరుపుదాడులు

### సెంటర్లలో పోలీస్ బృందాల ముమ్మర తనిఖీలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాలతో ఒంగోలు నగరంలోని స్పా సెంటర్లపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలోని సిఐలు, ఎస్‌ఐలు, పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో స్పా సెంటర్లపై దాడులు చేశారు. సెంటర్లలో ముమ్మర తనిఖీలు చేశారు. సెంటర్లలో ఎంత మంది పని చేస్తున్నారు... వారి వివరాలు ఏంటి అని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఒంగోలు నగరంలో సుమారు 18 స్పా సెంటర్లు ఉన్నాయి. స్పా నిర్వాహణపై అనేక అనుమానులు వ్యక్తమౌతున్నాయి. ఈ క్రమంలో నూతన జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్ ఆదేశాలతో స్పా సెంటర్ల యజమానులకు గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

# హత్యా సంస్కృతి జగన్‌రెడ్డిదే

**మొదటి పేజీ తరువాయి** జరిగిన హత్యాలన్నింటినీ కూటమి ప్రభుత్వానికి జగన్ రెడ్డి అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారనందుకు తమ నేత తోట చంద్రయను హత్య చేసిన సంస్కృతి వైకాపాదని గుర్తుచేశారు. టిడిపి ప్రభుత్యం హత్యా రాజకీయాలను ప్రోత్సహించదన్నారు. తోట చంద్ర య్యలాంటి ఎంతో మంది టిడిపి నేతలను జగన్‌రెడ్డి హత్యలు చేయించారని, ఏ మొహం పెట్టుకుని జగన్ ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తారని ఎద్దేవా చేశారు. గత అయిదేళ్లలో టిడిపి అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తే జగన్ రెడ్డి హేళన చేశారని, నిండు సభలో మాజీ ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా తమ అధినేతను అవమానించారని, తమ దళిత ఎమ్మెల్యేపై దాడి చేశారని, దీన్ని గమనించే ప్రజలు 11 సీట్లే గెలిపించారని, అయినా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదన్నారు. జగన్ రెడ్డి బెదిరింపులకు బెదిరేవారు ఏవరూ లేరని, ఇప్పటికైనా జగన్ రెడ్డి శవ రాజకీయాలను మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజాలకు ఉపయోగపడే చర్చల్లో పాల్గొంటే మంచిదని హితవు చెప్పారు. అయిదేళ్ల పాటు నేరాలు, ఘోరాలతో రాష్ట్రాన్ని నేరాంధ్రగా మార్చిన జగన్ రెడ్డి నేడు రాష్ట్రపతి పాలన గురించి మాట్లాడటం విడ్డూరమని పేర్కొన్నారు. రేపల్లెలో అమర్నాధ్ గౌడ్, మాచర్లలో తోట చంద్రయ్య, మదనపల్లిలో ఫాతిమా ఇలా వైసీపీ పాలనలో జరిగిన దారుణహత్యలు చాలానే ఉన్నాయాన్నారు. ఎన్డీయే కూటమి నెల రోజుల పాలనకే రాష్ట్రపతి పాలన కావాలంటే.. మరి నాడు మీ అరాచక పాలనకు మిమ్మల్ని ఈ పాటికి దేశ బహిష్కరణ చేసి ఉండాలని పేర్కొన్నారు. ఇకనైనా మీ వంకర బుద్ధి మార్చుకోకపోతే కచ్చితంగా ప్రజలే మిమ్మల్ని దేశం నుంచి తరిమికొడతారని జగన్ రెడ్డిని హెచ్చరించారు. ఢిల్లీలో ధర్నా చేసేముందు ఆంధ్రలోని గల్లీగల్లీలో నీ అరాచక పాలన ఆనవాళ్లకు కాళ్ళ మీద పడి క్షమాపణ కోరితే ప్రజలు హర్షిస్తారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన గురు పౌర్ణమి వేడుకలు

### -గ్రామంలో భిక్షాటన




భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని శ్రీ సాయిబాబా ఆలయంలో శ్రీ సాయినాథ-దత్తాత్రేయ స్వామి వార్ల గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయని శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు-అద్దేపల్లి గ్రామాలలో శ్రీ సాయినామ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తూ భిక్షాటన కార్యక్రమం నిర్వహించామన్నారు. బిక్షాటనలోఆలయ కమిటీ సభ్యులు,మహిళలు భక్తులు పాల్గొని జోలెపట్టి గ్రామంలోని ఈ జిల్లాలో బిక్షాటన గావించారు. అదేవిధంగా 21వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి సుప్రభాతం,కాగడా హారతి,గం 7 లకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం,అష్టోత్తర పూజలు నిర్వహించబడతాయన్నారు.ఈ పూజలో ముద్దుల కిరణ్ తేజ- రామలక్ష్మి కల్కి దంపతులతో పాటు కామేపల్లి బాలాజీ సత్యకుమార్లు పాల్గొంటారని తెలిపారు.గం 12 లకు మధ్యాహ్న హారతి,అనంతరం నారాయణ సేవ(అన్న ప్రసాద వినియోగము)జరుగుతుందని రమేష్ బాబు తెలిపారు.శని ఆదివారాలలో జరిగే గురు పౌర్ణమి వేడుకలలో అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని రమేష్ బాబు కోరారు.

## కేంద్ర బలగాలతో పవన్ కళ్యాణ్ కు రక్షణ కల్పించాలి: సోమరౌతు అనురాధ



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రమాదం పొంచి ఉంద నే కథనం పై జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోమ రౌతు అనురాధ స్పందించారు. శనివారం ఈ సందర్భంగా ఆమె భట్టిప్రోలు విలేకరులతో మాట్లాడుతూ,మా అధినేత పవన్ కళ్యాణ్ దేశ,రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. అటువంటి పవన్ కళ్యాణ్ కు విద్రోహ శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని కేంద్ర ప్రభు త్వం కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని ఆమె కోరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర ప్రభు త్వం కూడా భద్రత పెంచాలని అనురాధ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో పారిశుద్ధంపై యుద్ధం





బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు పారిశుద్ధ పనులను పరుగులు పెట్టిస్తున్న బాపట్ల పురపాలక సంఘం నూతన కమిషనర్ నిర్మల్ కుమార్.బాపట్ల పట్టణం గత ప్రభుత్వంలో నిర్మించిన మురుగునీటి కాలువలు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణానికి ఉపయోగించిన పరికరాలను కాలవలోనే వదిలిపెట్టి వెళ్లిన కారణంగా మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతూ అస్తవస్తంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని బాపట్ల నియోజకవర్గ శాసనస భ్యులు నరేంద్ర వర్మ చొరవతో బాపట్ల నూతన పురపా లక సంఘం కమిషనర్ వడాలశెట్టి నిర్మల్ కుమార్ పరిశీ లించి సెంట్రింగ్ ప్లేట్లను, కర్రలను తొలగించాలని పారి శుద్ధ కార్మికులకు ఆదేశాలు జారీ చేశారు. గత అధి కారులు ఎవరూ సమస్యను గుర్తించలేదని క్షేత్రస్థాయి లోకి వెళ్లి పనులను పరిశీలిస్తూ అడ్డంకులను గుర్తించి సమస్యలకు పరిష్కారం చూపిస్తున్న కమిషనర్ గా ఎంతో మంచి పేరు తెచ్చుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

# ఎంతటి విపత్తునైనా ఎదుర్కొని ప్రజలకు సేవలందిస్తాం: జిల్లా ఎస్పీ





బాపట్ల, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం ఎస్పీ స్వయంగా కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి, లోతట్టు ప్రదేశాల పరిస్థితులను గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనుమూడి వంతెన వద్ద కృష్ణానది నది ప్రవాహాన్ని పరిశీలించి అనంతరం రేపల్లె డిఎస్పి కార్యాలయాన్ని సందర్శించి నది పరివాహక ప్రాంతాలలో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అల్పపీడన ప్రభావం తో విస్తారంగా వర్షాలు పడుతున్నాయన్నారు. అల్పపీ డన ద్రోణి ప్రభావం మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువన కురు స్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుండి నీటిని కిందకి విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు. జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలలో, లంక గ్రామాలలోని పరిస్థితుల గురించి పోలీస్ అధికారులతో చర్చించి, తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి, ఒకవేళ వరద ముంపు సంభవిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలో తగిన సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితు లైన ఎదుర్కొని ప్రజలకు సేవ చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కురు స్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, వాగులు, నదులు ప్రమాద స్థాయిలో ప్రవహించే అవకాశం ఉన్న ందున లోతట్టు ప్రాంతాల లో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపునకు గురవడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో నివాసం ఉండే ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాసల లోకి వెళ్లాలని, బ్రిడ్జిలు, కల్వర్టుల పై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయ వద్దని, ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకోవాలని, ప్రజ లు ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశంతో పోలీ సులు సూచించే సూచనలు తప్పనిసరిగా పాటిం చాలని, అవి మీ యొక్క భద్రత కొరకే అని గ్రహించా లని, ప్రజలు పోలీసుల తక్షణ సహాయం కొరకు డయల్ 100/112 కి, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. వారి వెంట రేపల్లె డిఎస్పి టీ.మురళీకృష్ణ, రేపల్లె పట్టణ ఇన్స్పెక్టర్ ఎస్.కె నజీర్ బేగ్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని మున్సిపల్ కార్యలయం ప్రక్కనే ఉన్న చికెన్ మార్కెట్ వెనుక వైపున ఖాళీగా ఉన్న స్థలాన్ని మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న షాపుల పాత భవనాలు తొలగించి వెనుకన ఉన్న ఖాళీ స్థలాన్ని కలుపుకొని ఎల్ షేపులో షాపులు నిర్మిస్తే అక్కడ ఉన్న వారితోపాటు మరి కొంత మందికి అవకాశం కల్పించవచ్చునని అభిప్రాయానికి వచ్చారు. భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కమీషనర్ రంగారావు, టీడీపి పట్టణ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి తమ్మనేని వెంకటరెడ్డి, నాయకులు తిరుపాలు, రోషన్ సంధాని, అహ్మద్, సద్గురు మూర్తి, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేను కలసిన యువనేత కార్తీక్



కనిగిరి, మేజర్‌న్యూస్: స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని సిఎస్‌పురం టీడీపి యువనేత మన్నేపల్లి కార్తీక్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్కను అం దజేశారు. సి.ఎస్.పురం మండలంలోని కంభం పాడు గ్రామం సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వద్దకు వెళ్లే దారిలో గల బస్సు షెల్టర్ ముఖ ద్వారాన్ని 167బి రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి బస్సు షెల్టర్, ముఖద్వారం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆలయా నికి వెళ్లే మట్టి రహదారిని తారు రోడ్డుగా మార్చా లని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం త్రివేది, గుర్రం హరి ఉన్నారు.

## రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిది లోని హాజీపురం గ్రామం రైతుసేవ కేంద్రంలో రెవిన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రం ఆర్‌సిసిఆర్ పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల తాసిల్దార్ వంగలవీటి కిషోర్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కౌలు రైతులు ముఖ్యంగా పంట హక్కుసాగు పత్రాలను పొందాలని భూ యజమానితో పాటు కౌలు రైతులకు పలు పథకాలు ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఉడుముల సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్యామల చిన్న వెంకటేశ్వర్లు, తెలుగు రైతు అధ్యక్షులు కందుల వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు ఉపాధ్యక్షుడు గాయం రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాయం సుబ్బారెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకులు మాసపోగు ఎర్రయ్య, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## నేడు కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: కనిగిరి అమరావతి గ్రౌం డ్లో నేడు జరిగే కంటి వైద్య శిబి రాన్ని హనుమంతుని పాడు మండ లంలోని ప్రతి ఒక్కరూ సద్విని యోగపరు చుకో వాలని మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరు పతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో కనిగిరి ముద్దుబిడ్డ డైనమిక్ లీడర్ సరైనోడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం ఉదయం 9గంటల నుంచి ప్రారంభం జరుగునని తెలియజేశారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి: విద్యుత్ ఏడిఏ



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో నెలకొన్న తుఫాను వాయుగుండం ప్రభావంతో గ్రామాలలో ఓ మోస్తరు వర్షాలు చిరుజల్లులు పడుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్ళినప్పుడు మోటార్లు వేసే సమయంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏడిఏ పిచ్చయ్య రైతులకు సూచించారు. స్థానిక సబ్ స్టేషన్ లో శుక్రవారం క్రింది స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని, బకాయిలు చెల్లించని వినియోగదారులకు విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. చెట్ల కింద, విద్యుత్తు తీగల కింద ఉండకుండా ఖాళీ ప్రదేశంలో ఉండాలని, విద్యుత్తు షాక్ కు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గృహ వినియోగదారులు విద్యుత్తు వినియోగించేటప్పుడు తడిచేతులతో బోర్డులను తాకవద్దని, అలా తాకటం వలన షాక్ కు గురి అయ్యే ప్రమాదాలు సంభవిస్తాయ ని తగిన జాగ్రత్తలు తీసుకొని విద్యుత్తు ఉపయోగిం చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ వీరబ్ర హ్మం, సబ్ ఇంజనీర్ ఇమ్మానియేల్ బాబు, ఎల్ఐ సాంబయ్య, లైన్ మాన్‌లు, సిబ్బంది ఉన్నారు.

# విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

## ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు





పంగులూరు, మేజర్ న్యూస్: విద్యార్థులకు విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని , విద్యార్థి లేకుండా విద్యా వ్యవస్థ లేదని, శాసనమండలి సభ్యుడు కె. ఎస్. లక్ష్మణరావు అన్నారు. 2024 మార్చి నెలలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో పంగులూరు మండల స్థాయిలో 550 మార్కులకు పైగా పొందిన, ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన, 2023 లో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థుల అభినందన సభ శనివారం పంగులూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసన మండలి సభ్యుడు కె. ఎస్. లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలకు వస్తూ ఉంటేనే ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలని, ఎంఈఓ లు, డీఈవోలు ,ఇతర ఉన్నతాధికారులు అవసరం ఉంటుందని, విద్యార్థులే లేకపోతే వీళ్లంతా అవసరం లేదని అన్నారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఈ ఉద్యోగులంతా తీసుకుంటే, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పుష్కలంగా ఉంటారని ఆయన చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అంతా చదువులేని కుటుంబాలకు చెందిన తొలితరం విద్యార్థులని, ఈ తరం విద్యార్థులకు జాగ్రత్తగా చదువు నేర్పి మంచి భవిష్యత్తును వారికి అందిస్తే, ఇక వారి కుటుంబాల్లో ఆనందమయమేనని లక్ష్మణరావు అన్నారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థులంతా సమాజంలో అణచివేతకు గురుకులైన వర్గాలకు చెందిన పిల్లలేనని ,వారి పట్ల ఉపాధ్యాయులు ప్రేమతో చదువు చెప్పాలని, మొత్తం విద్యార్థుల పైనే ఫోకస్ పెట్టి పాఠాలు చెప్పాలని ఆయన కోరారు. విద్య ద్వారానే జీవితాలు మారతాయని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. ఇక్కడకు దగ్గరలో ఉన్న రావినూతల గ్రామంలో 35 ఏళ్ల క్రితం పత్తి రైతులు నష్టాలతో ఆత్మహత్య చేసుకున్నారని, తరువాత పిల్లలను చదివించుకోవడంపై ఆసక్తి చూపటం వలన, ఇప్పుడు ఆ గ్రామానికి చెందిన 100 కుటుంబాలకు పైగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. ఈ చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాలకు చెందిన వారు కూడా విదేశాల్లో చాలామంది స్థిరపడ్డారని చెప్పారు. ఈ ప్రాంతంలో చదువు పట్ల అవగాహన పెరిగిందని, ఒకరిని చూసి ఒకరు మా పిల్లలను చదివించుకోవాలి అనే పట్టుదల,కోరికలు పెరిగాయని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పిల్లలు చదువుకునేందుకు ముందుకు వస్తున్నారని, వారంతా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, అందువలన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు చదువును లక్ష్యంగా పెట్టుకుని చక్కగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు అన్నారు. ఇందుకు ఉదాహరణగా ఆస్ట్రేలియాకు చెందిన'' నిక్'' గురించి చందలూరు పాఠశాలకు చెందిన గొట్టిపాటి చంద్రిక అనే విద్యార్థిని ద్వారా సభలో చెప్పించారు. కాళ్లు, చేతులు లేకపోయినా పట్టుదలతో చదువుకొని అన్ని రకాల ఆటల్లో నిక్ ప్రావీణ్యం సాధించాడని, విద్యార్థులంతా నిక్ ను ఆదర్శంగా తీసుకొని చదవాలని కోరారు. పంగులూరు మండలంలో హైస్కూలు లు చక్కగా పనిచేస్తున్నాయని, ఉపాధ్యాయులు ఒకరికొకరు పోటీపడి విద్యార్థులకు చక్కగా పాఠాలు చెబుతున్నారని చెప్పారు. అయితే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి పాఠశాలలో 500 మందికి మించి విద్యార్థులు ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండలంలో ప్రవేట్ పాఠశాలలు లేకపోవటానికి ఇక్కడున్న ఉపాధ్యాయుల సమిష్టి కృషి కారణమన్నారు. ప్రైవేట్ పాఠశాలలు చెందిన బస్సులను కూడా గ్రామాల్లోకి రానీయకుండా ఉండేందుకు విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్ సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని, ట్రిబుల్ ఐటీ సాధిస్తే ఆరు సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఉద్యోగంతోనే బయటకు వస్తారని ఆయన చెప్పారు.

అనంతరం లక్ష్మణరావు తల్లిదండ్రుల పేరుతో ఉన్న కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ట్రిబుల్ ఐటీ, ఎన్ఎంఎంఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలు, 1,000 రూపాయల నగదు, బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాలను విద్యార్థులకు బహుకరించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు టీ.వీ. నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే. నాగభూషణం, జి. వీరాంజనేయులు, పంగులూరు, అలవలపాడు, కొండ మంజులూరు, చందలూరు, బూధవాడ జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొప్పో లు రమాదేవి, స్వయంపు గోవిందరాజులు, ఇమ్మడిశెట్టి అనిత, చందలూరి గిరిజ, కే. బంగారుకొండ, ముప్పవరం హై స్కూలు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, నాగాలాండ్ రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు. చెంచయ్య, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చందలూరు విద్యార్థిని నాయపాము శృతి యోగాలో అనేక ఆసనాల ద్వారా సభికులను ఆకట్టుకుంది.

## పుల్లెల గోపిచంద్‌ను కలిసిన మాధవప్రసాద్



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రపంచ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్‌ను నారాయణస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీచైర్మన్ పాములపాటి మాధవప్రసాద్ కలిశారు. శనివారం హైదరాబాద్ హైటెక్స్ నందు జరిగిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలకు వచ్చిన పుల్లెల గోపిచంద్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గొట్టిపాటి సత్యవాణిలను కలిసి నారాయణస్వామి చిత్రపటాన్ని అందజేసి స్వామివారి చరిత్రను వివరించి దేవస్థానం సందర్శించాలని అదేవిధంగా నారాయణస్వామి కాకతీయ కమ్మ అన్నదాన సత్రం తరపున అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమ్మగ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు ఉన్నారు.



## ఎమ్మెల్యే బిఎన్‌ని కలిసిన వ్యవసాయ శాఖ అధికారులు

సంతనూతలపాడు,మేజర్‌న్యూస్: ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సంతనూతలపాడు మండల వ్యవసాయ శాఖ అధికారిణి పి.పావని ఆధ్వర్యంలో మండలంలోని వ్యవసాయ శాఖ బృందం సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు ఏవో పావని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుబ్బారెడ్డి మండలంలోని సచివాలయాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



## ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

### డ్వామా పీడీ బి.అర్జున్ రావు

తాళ్లూరు, మేజర్‌న్యూస్: ఉపాధిహామీ పనుల్లో అన్ని గ్రామాల్లో అక్రమాలపై ఆడిట్ సిబ్బంది నివేదికలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే రికవరీతో పాటు క్రమశిక్షణా చర్యలు తప్పవని డ్వామా పీడీ బి అర్జునరావు తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 16 పంచాయితీలలో వారం రోజులుగా ఆడిట్ డిఆర్పీలు క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో కూలీల మస్టర్లు, కొలతల్లో తేడాలు ఉన్నట్లు నిర్ధారించారు. మండలంలో 791 పనులకు గాను ఐదు కోట్ల 83 లక్షల ఉన్నట్లు గుర్తించి, నిర్ధారించారు. అందులో రెండు లక్షల 60 వేలు సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని ఆడిట్ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకురాగా రికవరీ కోసం ఆదేశించారు. అందులో ప్రధానంగా తాళ్లూరులో 58454, శివరామపురంలో 89719, మల్కాపురంలో 29657, బెల్లంకొండవారిపాలెంలో 22017, మన్నేపల్లిలో 13690 రూపాయలు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అనంతరం పీడీ అర్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లోఅన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా రికవరీ చెల్లించాల్సిందేనన్నారు. రికవరీకి కొంత సమయం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గడువులోపు చెల్లించాలని సూచించారు. లేనిచో క్రమ శిక్షణా చర్యలకు ఆదేశించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పి ఝాన్సీరాణి, ఏపిడి జికె నిర్మలాదేవి, అంబుడ్స్మెన్ శ్రీకాంత్రెడ్డి, ఎస్ఆర్పి టి నందిని,జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె యుగకీర్తి, ఏపిఓ మురళి, డిఆర్పీలు సురేష్బాబు, భరత్కుమార్, చైతన్యకుమార్, నరేంద్ర, కోటేశ్వరరావు, సూర్యప్రకాశరావు, రవి, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తాం

అద్దంకి, మేజర్‌న్యూస్: పురపాలక పరిధిలో ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తామని కమిషనర్ సత్యనారాయణ అన్నారు.అద్దంకి పట్టణంలో అన్ని వార్డులలో స్థానిక సమస్యల మీద మున్సిపల్ కమిషనర్ స్థానిక నేతలతో కలిసి పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రెండవ వార్డ్ పరిధిలో పర్యటించారు. ఈ ఈ సందర్భంగా వచ్చిన కమిషనర్ కు స్థానికులు పలు సమస్యలను విన్నవించుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, శానిటేషన్ మీద ప్రధానంగా దృష్టి పెట్టి ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా డ్రైనేజీలను శుభ్రపరచుట, మరియు కాళి ప్రదేశాలలో రోడ్లపై గేదెలు లేకుండా చూడుట, దోమల నివారణకు చర్యలు చేపట వీధిలైట్లు అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మా ణాలు, వంటి విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక సమస్యలపై స్పందించిన కమీషనర్ మాట్లాడుతూ వెంటనే అన్ని రకాల సమస్యలపై దృష్టిచారించి ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పురపాలక శాఖ అధికారులు సిబ్బంది, స్థానిక తెదేపానేతలు ఉన్నారు.

## మెరిట్ విద్యార్థులకు సాయి ప్రతిభా పురస్కారాలు



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానము కల్యాణ మండపము నందు ఆలయ కమిటి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని అన్ని గ్రూపుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ సాయి ప్రతిభా పురస్కారములు అందజేశారు. ఈ కార్యక్రమమునకు ఆలయ అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. లింగారెడ్డి పల్లె హెడ్మాస్టర్ కె.మాధవశర్మ శర్మ, ఏం.ఎస్.ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, విజేత కాలేజ్ డైరెక్టర్ పి.అరుణోధర్, యుటీఎఫ్ నాయకులు బి.రుషేంద్ర, రామరాజు పాల్గొన్నారు. ప్రతిభ గల విద్యార్థిని, విద్యార్థులకు బాబా మెమంటో, కాలేజ్ బ్యాగ్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వాగిచెర్ల వెంకటేశ్వర్లు, బద్వేటి కృష్ణమూర్తి, ఆర్.సంజీవయ్య, కొప్పుకోటయ్య, సిహెచ్ వీరబ్రహ్మం పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట

తాళ్లూరు, మేజర్‌న్యూస్: వ్యవసాయంలో మారుతున్న వాతావరణ మార్పుల అనుగుగంగా సాగు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, ప్రకృతి సిద్ధంగా సాగ్యమైన ఆరోగ్యమైన ఉత్పత్తులు సాధించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి తెలిపారు. నాగంబొట్లపాలెం రైతు సేవాకేంద్రం పరిధిలోని యస్‌సి రైతులు సాగు చేయుచున్న ప్రకృతి పద్ధతులకు అవసరమైన డ్రమ్ములు, టార్పాలినే పట్టల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రైతులకు అందించిన ఈ సదుపాయాలను వినియోగించుకొని, ప్రతి రైతు కనీసం అర ఎకరా నుండి ఎకరా పొలం ప్రకృతి సాగుచేయాలని తెలిపారు. ఈ సీజన్లో జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో సాగు చేయుటకు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.ప్రసాద్ రావు, సర్పంచ్ సుబ్బారావు, యతం శ్రీనివాస్ రెడ్డి, ఎడికోల నరసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి

అద్దంకి, మేజర్ న్యూస్: రాష్ట్రప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పని చేయాలని బాపట్ల జిల్లా ఇన్చార్జి డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి మండల విద్యావనరుల కేంద్రం వద్ద అద్దంకి, జే పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు,యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఎంఈవో డీ. గంగాధర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డీఈవో మాట్లాడుతూ గతేడాది జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డుకు చెల్లించాల్సిన రుసుము వెంటనే జమ చేయాలన్నారు. బకాయిలు చెల్లించిన యాజమాన్యాలకు మాత్రమే నిరభ్యంతర ధృవపత్రం ఇస్తామని వివరించారు. విద్యా సంవత్సరం పూర్తిస్థాయిలో ప్రారంభం కాకుండానే పరీక్షల తేదీలు తెలుపుతూ వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే సమాచారాన్ని ఎవరూ పరిగణలోకి తీసుకోరాదన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలు వెంటనే తెలియజేయాలన్నారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి వివరాలను వెంటనే సంబంధిత ఎంఈవోకు తెలియజేయాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించాలని, అర్హత కలిగిన



ఉపాధ్యాయులను మాత్రమే నియమించుకోవాలనీ సూచించారు. ప్రతిపాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైన మేర ఉపాధ్యాయులను నియమించుకోవాలన్నారు. వసూలు చేసే రుసుము వివరాలను నోటీసు బోర్డులో ఉంచి తెలియ జేయాలన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు ఛైర్మన్ డి.ప్రసాదరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా బోర్డుకు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలన్నారు. గతేడాది బకాయిలు సకాలంలో చెల్లించాలని చెప్పారు. చీరాల ఉపవిద్యాధికారిణి నిర్మల, ఎంఈవో -2 బి. సుధాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోతురాజు, మారుతి, ప్రవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు, ప్రధానోపాద్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందన సభ

కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందన సభ కార్యక్రమం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. పట్టణంలని శ్రీ వాసవి గ్రంథాలయంలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం జరుగుతుందని మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహంవద్ద నుండి, ఆర్యవైశ్యులందరూ ర్యాలీగా బయలుదేరి వాసవి గ్రంథాలయం వద్దకు చేరుకుంటారు అని తెలిపారు.



## పంటసాగుపై రైతులకు మెళుకువలు

చీరాల, మేజర్‌న్యూస్: మండలంలోని ఈరోజు కావూరి వారి పాలెం పంచాయితీలో బాపట్ల వ్యవసాయ కళాశాల వారు మల్లె పూల తోటలను, వేరుశనగ పొలాలను పరిశీలించి రైతులకు పురుగు నివారణ, తెగుళ్ల నివారణకు సంబంధించి సూచనలు ప్రొఫెసర్స్ ఓబయ్య అచ్యుత రాజు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెగుళ్లను రైతులు ముందుగానే గమనించి మంచి మందులు పిచికారి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలతా, రత్న కుమారి, ప్రొఫెసర్స్ పాల్గొన్నారు. వీరితోపాటు కావూరి రమణారెడ్డి, మంచాల తారక్, ఎ.ఏడుకొండలు రెడ్డి, మంచాల వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



గిద్దలూరు, మేజర్‌న్యూస్: గిద్దలూరులో ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటా చేపడుతున్న కుష్టు వ్యాధి సర్వేను సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ సమయ మాట్లాడుతూ కుష్టు వ్యాధి సర్వే కార్యక్రమాన్ని తప్పులు లేకుండా నిర్వహించి రోగాలను గుర్తించాలని గుర్తించిన రోగులకు తక్షణమే తగిన చికిత్సను వెంటనే అందించాలని సమాజంలో కుష్టి వ్యాధి ఉన్నవారిపై వివక్షణ చూపవద్దని కుష్టు వ్యాధి ఇతర అంటూ వ్యాధుల వలె సూక్ష్మ క్రిమిన వస్తుందని ఇది మైక్రో బ్యాక్టీరియా ద్వారా సంక్రమించు ఒక అంటువ్యాధి అన్నారు. కుష్టువ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడటం, వైద్యుల సలహాలు, సూచనలు పాటించడం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పూర్తిగా నయం చేసుకోవచ్చు. అలాగే శరీరంపై స్పర్శ లేని మచ్చలు,చర్మం పొడిబారడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షను చేయించుకోవడం,ఒకవేళా కుష్టు జబ్బుగా గుర్తిస్తే వెంటనే సరియైన చికిత్స చేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించవచ్చు. అనంతరం కుష్టి వ్యాధి సర్వేపై ఆశ వర్కర్లకు ఏఎన్‌ఎం లకు తగిన సూచనలు సలహాలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమణి, సబ్ ఆఫీసర్ రంగనాయకులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## గురుపూర్ణిమ పూజలు



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని రామ గోపాలపురంలో శిరిడి సాయి బాబా దేవస్థానంలో ఆది వారం నాడు గురుపౌర్ణమి జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు ఆదివారం ఉదయం 5-30 నిమిషాలకు కాకడ హారతి ఉదయం 8 గంటలకు సాయినాధుని పంచామృత అభిషేకం మధ్యాహ్నం 12 గంటల నుండి హారతి 12 నుంచి సాయినాధుని మహా అన్న ప్రసాద వితరణ మందిరాల్లో జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 8 గంటలకు సంధ్య భారతి రాత్రి శ్రీ సాయినాధుని పల్లకి సేవ 9 గంటలకు శేస్ ఆరతి కార్యక్రమాలు జరుగుతాయని భక్తులందరూ విచ్చేసి గురుపౌర్ణమి మహెూత్సవంలో పాల్గొని బాబావారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబా వారికి ప్రియమైన అన్నదాన కొరకు భక్తులు విరివిగా విరాళాలు ఇచ్చి బాబా వారి గొప్పకు పాత్రులు కావాలని వారు అన్నారు.



## గంగమ్మకి ఆషాఢం సారే

తాళ్లూరు, మేజర్‌న్యూస్: గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆషాడ మాస సారె సమర్పించారు. మండలంలోని తూర్పు గంగవరం, సోమవరప్పాడు గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు ప్రదర్శనగా ఆలయం వద్దకు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కోసన గురుబ్రహ్మం తగు ఏర్పాట్లు చేశారు. పసుపు కుంకుమ గాజులు పట్టు చీరలతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని సారే సమర్పించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రికార్డ్ అసిస్టెంట్ కే.శ్రీనివాసరావు పరివేక్షించారు.

## పవన్ కల్యాణ్‌కు జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించండి

భట్టిప్రోలు,మేజర్ న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను భద్రత విషయం లో కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించి నందున వెంటనే పవన్ కళ్యాణ్ కు జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడి కి సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాస రావు విజ్ఞప్తి చేస్తూ లేఖ వ్రాశారు.శనివారం భట్టిప్రోలు విలే కరులతో ఆయన మాట్లాడుతూ వైసిపి ఓటమికి పవన్ కళ్యాణ్ కారణమని జగన్ కక్ష పెంచుకున్నారని, కూటమీప్రభుత్వం ఏర్పాటు లో పవన్ కళ్యాణ్ కీలక మయ్యారన్నారు. కావున పవన్ కళ్యాణ్ ను అంతం చేయడానికి జగన్ కుట్రలు చేస్తున్నారని,గతంలో కూడా సిఎం గా ఉన్న జగన్ అనేక దాడులను పవన్ కళ్యాణ్ పై చేయడం వాస్తవం అని శ్రీనివాస రావు పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ కు ఎలాంటి హాని జరిగిన దానికి పూర్తి బాధ్యత జగన్ దే నని శ్రీనివాస రావు పేర్కొన్నారు.జగన్ కుటుంబంకు 50సంవత్సరాలు నేర చరిత్ర ఉన్నదని గుర్తు చేశారు.రాష్టం అభవృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ కు అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.





## ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల, మేజర్‌న్యూస్: వర్షాల కారణంగా పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమీషనర్ చక్రవర్తి అన్నారు. పురలపాలక సంఘ పరిధిలోని పలు డ్రయిన్లు, చెత్త సేకరణ ప్రదేశాలను కమీషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు అం దజేశారు. స్వర్ణ రోడ్డు, పోలేరమ్మ గుడి, గడియారస్థంభం, మసీదు సెంటర్, ముక్కోణం పార్క్, దండుబాట ప్రాంతాలను సుదీర్ఘంగా పరిశీలించారు. పురపాలక సంఘ పరిధిలో ఎక్కడా కూడా వర్షపు నిల్వలు, మరుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. డ్రయిన్లలో పారుదల ఉండేలా చూడాలన్నారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వివరించారు. కమీషనర్ వెంట శానిటేషన్, వార్డు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.



## కోలాహలంగా పీర్ల గ్రామోత్సవం

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మొహర్రం నెలను పురస్కరించుకుని మండల కేంద్రమైన సి.ఎస్.పురం పట్టణంలోని కెనరాబ్యాంక్ సమీపంలోగల పీర్లచావిడి పీర్లగ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రకరకాల వస్త్రాలు పూలమాలలు వివిధ అలంకరణ చేసిన పీర్లకు ముందుగా మతపెద్దలు నిర్వాహకులు ప్రార్థనచేసి అనంతరం మేళతాళాలు తప్పెట్ల మధ్య ఊరేగింపుగా అగ్నిగుండం వద్ద ప్రదక్షిణలు చేసి అగ్నిప్రవేశం చేశారు. ఈ సందర్భంగా పరిసరాలు ప్రజలతో కోలాహలంగా మారింది.

## పాదయాత్రకు బిజెపి నేతలు సంఘీభావం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: కాశ్మీర్ నుండి కన్యాకుమారి పాద యాత్ర చేస్తూ మార్గ మధ్యంలో గిద్దలూరు పట్టణంలో ఏంఆర్ఓ ఆఫీస్‌లో మొక్కనాటిన కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ నారాయణ రెడ్డి, గిద్దలూరు పట్టణ బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ హాజరు అయి సంఘీభావం తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, అసెంబ్లీ కో కన్వీనర్ గుమ్మా రాముడు, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు, పట్టణ జనరల్ సెక్రటరీ మునగ నూరి రామకృష్ణ, రూరల్ మండలం అధ్యక్షులు కె.తిరుపాల్ రెడ్డి, పాత్రికేయ మిత్రులు పాల్గొనడం జరిగింది. ఈ పాద యాత్ర ముఖ్య ఉద్దేశము భారతదేశం ఆర్థిక అభివృద్ధి చెందాలని, సుభిక్షంగా ఉండాలని, యువత ఆయు ఆరోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ పాదయాత్ర చేస్తుండడం చాలా సంతోషకరమన్నారు.

# నిర్వహణ లోపమే వైఫల్యానికి కారణం

అద్దంకి, మేజర్ న్యూస్: మహిళలు సమిష్టిగా చేపట్టిన మార్ట్ నిర్వహణలో లోపించిన సమన్వయమే పూర్తి వైఫల్యంకు కారణమని చీరాల ఆర్డీవో జి. సూర్యనారాయణ రెడ్డి అన్నారు.అద్దంకి మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళామార్టు గతనెలలో మూసిన విషయం పాఠకులకు విదితమే. అనంతరం మహిళామార్టు నిర్వహణలో తలెత్తిన లోపాలపై పాలక కమిటీసభ్యులు జిల్లా కలెక్టర్ కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, జిల్లా సహకారాధికారి శ్యాంసన్, డీఎల్డీవో సువార్త, అద్దంకి పురపాలక కమిషనర్ ఎం. సత్యనారాయణ శనివారం విచారణ చేపట్టారు. పలు విషయాలను కమిటీ సభ్యులు, ఆర్పీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తమపై నమ్మకంతో మహిళామార్టుకు పెట్టుబడినిధులు సమకూర్చారని, ఇందులో ఏం జరుగుతోందో తెలియజేసే బాధ్యత తమపై ఉందన్నారు. కేవలం సీఎంఎం ఏకపక్ష నిర్ణయాల కారణంగానే మార్ట్ మూతపడే స్థితికి చేరిందని వాపోయారు. ఎక్కువ మంది సభ్యులు తమ పెట్టుబడి వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని,ఈ కారణంగా తాము మార్టు నిర్వహించలేమని తేల్చి చెప్పారు. ఇదే సమయంలో సీఎంఎం కూడా తాము నిర్వహించిన లావాదేవీలన్నిటికీ పత్రాలు ఉన్నట్లు ఆధారాలుచూపించారు. ఆమేరకు ఆర్డీవో మాట్లాడుతూ దస్త్రాలునిర్వహణలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనీ, ఏకపక్ష నిర్ణయాల కారణంగా మహిళాసభ్యుల మధ్య అంతరాలు పెరిగాయన్నారు. దీనికి



తోడు వ్యాపార నిర్వహణ కష్టంగా మారింది. అందువల్లనే మహిళామార్టు నష్టాలొచ్చినట్లుగా భావిస్తున్నానని అన్నారు. పొదుపు సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని, అనంతరం కమిటీ సభ్యుల 'మహాసభ' తీర్మానాలను పురపాలక కమిషనర్ ద్వారా తమకు అందించాలని సూచించారు.మార్ట్ నిర్వహించాలన్నా, మూతవేయాలన్నా మహిళలదే తుది నిర్ణయంగా వెల్లడించారు. ఏది ఏమైనా పొరపాట్లు జరిగినట్లు రుజువు అయితే మాత్రం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# పంటల సాగుపై రైతులకు అవగాహన

పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని పెద్ద బొమ్మలా పురం, చిన్నదోర్నాల, కటాకనిపల్లి గ్రామాలలో వ్యవసాయ, రెవిన్యూ శాఖ వారు సిసిఆర్షి కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జవహర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి వలన ప్రత్తి పంటకు ప్రత్యామ్నాయం పంట కందులను సాగు చేయాలనీ, కంది విత్తనాలు 30శాతం రాయితీపై పంపిణి చేస్తున్నట్లు, అలాగే విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే కౌలు రైతులను గుర్తించి వారికీ సిసిఆర్‌సి కార్డులను గ్రామ సర్పంచ్ గుండారెడ్డి పోలమ్మ, ఎంపీటీసీ చింతలచెరువు వెంకట రెడ్డీ రైతులకు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఆర్వోలు డి.రామయ్య, వై. శ్రీనివాసులు, విహెచ్‌ఎ కె.నీలా నాయక్, డి.శ్వేత, యం.రాజేంద్ర ప్రసాద్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# బాలింతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: శనివారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్యకేంద్రం పరిధిలో అందిస్తున్న వైద్యసేవలు పేషంట్ల నమోదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గర్భవతులు బాలింతలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని గ్రామాల్లో డెంగ్యూ మలేరియాఇతర అంటువ్యాధులు రాకుండా ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కుష్ఠువ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి తగిన వైద్యాన్ని అందించాలని డాక్టర్లు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారి ప్రసాద్ బాబు, ప్రోగ్రాం అధికారులు కె సుబ్బలక్ష్మి, కె.సుగుణావతమ్మ, స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్ నిర్మాణప్రాంతం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: గ్రామాల్లో నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఆర్‌డి యస్ పథకం గుత్తేదారులు మండలంలోని గ్రామాల్లో గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ఇష్టారాజ్యంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో ఏర్పాటుచేస్తున్న ట్రాన్స్ ఫార్మర్ దిమ్మె నిర్మాణం నిరంతరం ప్రజలు పాఠశాల విద్యార్థులు తిరుగుతూ ఉండే సిమెంట్ రహదారికి అడుగున్నర దూరంలో రహదారి మలుపు తిరుగుప్రాంతంలో ట్రాన్స్ ఫార్మర్ దిమ్మె నిర్మాణం చేపడుతుంటే గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తంచేసినా నిర్మాణం చేపట్టారు. దిమ్మెనిర్మించిన ప్రాంతంలో కాకుండా పక్కనే ఖాళీస్థలంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా మండలంలో పలుగ్రామాల్లో ఆర్‌డియస్ ఇష్టారాజ్యంగా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆయా గ్రామాల ప్రజల అభ్యంతరాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తుండటం గమనార్హం.

# నేడు గురుపూర్ణిమ మహోత్సవం

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః చీమకుర్తి పట్టణంలోని రచ్చమిట్ట సెంటర్‌లోగల శ్రీ షిరిడి సాయిబాబా మందిరములో 21వ తేది ఆదివారము గురుపూర్ణిమ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ షిరిడిసాయి సేవా సమితి నిర్వహకులు తెలియజేశారు. 21వ తేది ఆదివారం ఉదయం 5.30 గంటలకు కాకడహారతితో కార్యక్రమాలు ప్రారంభ ం. ఉదయం 6 గంటలకు మంగళస్నానం, ఉదయం 7 గంటలకు సాయిబాబాకు అభిషేకం అనంతరం సాయిబాబా దివ్య (పాదస్పర్శ) పాద పద్మములు స్పర్శన భాగ్యము కలుగుచేస్తారు. ఉదయం 11 గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం. సాయంత్రం 5 గంటలకు సాయిబాబా నగరోత్సవం, పల్లకి సేవ, కోలాట ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని, కావున భక్తులందరూ పాల్గొని శ్రీ సాయినాథుని దివ్య ఆశీస్సులు అనుగ్రహం పొందాలని శ్రీ షిరిడి సాయి సేవా సమితి నిర్వహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

**– రామతీర్థంలో...**

దక్షిణ ఖాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సాయిబాబా మందిర కమిటీ నిర్వహకులు తెలిపారు. సాయిబాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమలు ఉంటాయని, ఉదయం 11.30 గంటల నుండి అన్న సంతర్పణ కార్యక్రమలు ప్రారంబించటం జరుగుతుందని సాయిబాబా మందిరం కమిటీ నిర్వహకులు తెలిపారు.



# క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ అలాకాలజిస్ట్ నూకసాని సుబ్బారావు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు కార్యక్రమం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అదుపులేని కణ విభజన అంటువ్యాధి కాదు మ్యాగ్నెట్ క్యాన్సర్ ఇతర విస్తరిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. గొంతు క్యాన్సరు మింగటంలో ఇబ్బంది శరీరంలో గడ్డ పెరగడం కులపీధి సైజుల్లో మార్పు ఉంటే క్యాన్సర్ అకస్మాత్తుగా బరువు తగ్గడం ఒక సూచిక నోటి ద్వారా మూత్రం ద్వారా రక్తం వస్తుంటే అది క్యాన్సర్ అని చెప్పవచ్చని విద్యార్థులకు ఈ సదస్సు ద్వారా అవగాహన కల్పించినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ క్యాన్సర్ వచ్చే ప్రధానంగా పొగ తాగటం ఆల్కహాలు గుట్కాలు మింగటం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# మొక్కలు నాటండి... పర్యావరణాన్ని కాపాడండి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో ఉత్తరప్రదేశ్లోని ఫతేపూర్ జిల్లా కరోలి గ్రామం నుండి పాదయాత్రగా బయలుదేరి శనివారం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాద యాత్రలో బాగంగా గిద్దలూరు పట్టణం కొచ్చిన శివకరణ్ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాల వాడ నరసింహారెడ్డి, భారతదేశ కోసం అమరులైన వారికి నివాళులర్పిస్తూ చెట్టు నాటారు. మన దేశంకోసం ప్రాణాలర్పించిన వారికి మాటలతో కాకుండా చెట్లు నాటి ప్రకృతిని కాపాడుతూ వారి ఆత్మ శాంతిచే విధంగా చెట్లునాటాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న గిద్దలూరు మండల డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు శర్మ మాట్లాడుతూ చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముందుగా వారిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. 15 వేల కిలోమీటర్లు పైగా చెప్పులు లేకుండా జాతీయ జెండా పట్టుకుని దేశం సుభిక్షంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్న శివ కరణ్‌కి



బిజెపి సభ్యులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఆయనను ముందుకు సాగనంపారు ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘసేవకులు గిద్దలూరు మండల బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి, జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి ఆంజనేయులు, గిద్దలూరు రూరల్ బిజెపి అధ్యక్షులు కాకర్ల తిరుపాల్ రెడ్డి, తాలూకా బిజెపి కోకన్వీనర్ గుమ్మా రాముడు, నాగేశ్వరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పూర్తి నష్టపరిహారం మంజూరుకు కృషి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: బెంగుళూరు కడప విజయవాడ(బికెవి) గ్రీన్ ఫీల్డ్ జాతీయరహదారికి సంబంధించి భూములు కోల్పోయిన ప్రతిరైతుకు తగిన నష్టపరిహారం మంజూరుకు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఉన్నతాధికారులకు వివరించి త్వరితగతిన నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తామని మండల టిడిపి ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలకేంద్రమైన సి.యస్.పురం చెరువు సమీపంలో జాతీయరహదారికి భూములు కోల్పోయిన రైతులతో పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భూములకు తగినంత నష్టపరిహారం అందేలా చూడాలని అదేవిధంగా వివిధ కారణాలతో నష్టపరిహారం మంజూరుకాని రైతులకు వచ్చేలా చూడాలని తెలపగా మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే ద్వారా కృషిచేస్తామని మన్నేపల్లి శ్రీనివాసులు అన్నారు.



# విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో విద్యుత్ ఘాతకానికి బలైపోయిన గేదెలు. గేదెల యజమానులు వల్లపు నేను చిన్న పాపయ్య భూమి దగ్గర ట్రాన్స్ఫారం కింద ఉండడంతో రెండు గేదెలు ట్రాన్స్ఫారాన్ని తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి .ఒక్కొక్క గేదే 50 వేల రూపాయలు చేస్తుంది. ఆ గేదెల యజమానులు ఐనేని వెంకట్ నారాయణ తండ్రి. వెంకటేశ్వర్లు. గిలక కోటేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు. గేదెలు కట్టిన పడ్డలు చనిపోయాయని బాధతో కన్నీళ్లతో విలపిస్తున్నారు. ఈ నష్టపోయిన పాడి రైతులకు



ప్రభుత్వం ఆదుకొని మాకు నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాము. ఆ గేదెల మీద జీవన ఉపాధి సాగిస్తున్నామని గేదెలు చనిపోవటంతో జీవనాధారం పోయిందని అన్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

# ముఖ్యమంత్రి దృష్టికి జిల్లా సమస్యలు

### జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరించండి
### సిఎం చంద్రబాబును కోరిన ఒంగోలు ఎంపి మాగుంట

ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లాలో ముఖ్యమైన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తీసుకెళ్లారు. శనివారం విజయవాడలో రాష్ట్ర పార్లమెంట్ సభ్యులతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జరిపిన సమావేశంలో ప్రకాశం జిల్లాలోని కొన్ని ముఖ్య సమస్యలను తెలియజేశారు. వారిటిని పరిష్కరించాలని కోరారు. జాతీయ ఉపాధి హామీ పథక నిధులతో ఎంపి, పంచాయితీ, శాసనసభ్యుల మొదలగు నిధులతో కలిపి పనులు చేపట్టుటకు మరిన్ని జాతీయ ఉపాది హామీ నిధులు రాబట్టడం, ప్రకాశం జిల్లాలో రోడ్లనిర్మాణానికి సెంట్రల్ రోడ్డు నిధులు రాబట్టడం, రాష్ట్ర ఆర్‌అండ్‌బి రోడ్లను నేషనల్ హైవే రోడ్లుగా మార్చడం, సింగరాయకొండ వద్ద యమర్జన్సీ విమాన లాండింగ్ పనులు పూర్తికి నిధులు కోరుట, ఒంగోలు పార్లమెంటు పరిధిలో రాచర్ల, దర్శి, కొండపిలో మూడు కేంద్రీయ విద్యాలయాలు, కంభంలో నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని కోరారు. ప్రకాశం తదితర జిల్లాలకు 13 మెడికల్ కాలేజీలు, గిద్దలూరులో సైనిక్ స్కూలు మంజూరు చేయాలని కోరారు.

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద రోడ్లు, వంతెనల నిర్మాణానికి నిధులు, దొనకొండలో వి.యల్.ఆఫ్. నావల్ స్టేషన్, ఆర్మీలాబ్, ఏవిఎషణ్ అకాడమీ, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు, ప్రకాశం జిల్లాలో పేపర్ మిల్లు ఏర్పాటు, నడికుడి, శ్రీకాళహస్తి రైల్వే లైను సత్వర పూర్తికి నిధులు, ప్రకాశం జిల్లాలో మంజూరైన 4 రైల్ ఓవర్ మరియు ఒక రైల్ అండర్ వంతెనల సత్వర పూర్తికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. వీటితో పాటు వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తికి, మార్కాపురం క్రొత్త జిల్లా ఏర్పాటు, కనిగిరిలో ట్రిపుల్ టి కాలేజి మంజూరుకు, పెదచెర్లోపల్లి మండలంలో తయారీ జోన్ ఏర్పాటుకు 18,859 కోట్లు మంజూరు, ఒంగోలు పట్టనణానికి అండర్ గ్రౌండ్‌వాటర్ సిస్టం, శిల్పారామం, పెద్ద స్టేడియం మంజూరు, ప్రకాశం జిల్లాలో జంతు ప్రదర్శన శాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి తప్పక కృషిచేసి ఏర్పాటు చేస్తానని తెలియజేశారు.



(ఫైల్‌ఫోటో)

## ప్రపంచ కమ్మమహా సభలో జిల్లా ప్రతినిధులు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం ప్రపంచ కమ్మ మహా సభ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జెట్టి కుసుమకుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ కమ్మవారి పట్టుదల, సమాజానికి వారు చేసిన సేవలను గురించి కొనియాడారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా కమ్మ సంఘం ప్రతినిధులుగా రావుల పద్మజ, కంచర్ల శ్రీకాంత్, చిడిపోతు వెంకటేశ్వర్లు, పావులూరి బాపయ్య చౌదరి, బత్తిన తిరుపతి స్వామి, బొద్దులూరి ఆంజనేయులు, అంజలి శ్రీనివాస్, కాట్రగడ్డ రఘు, కంచర్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన జేసి గోపాలకృష్ణ



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ శనివారం ఉదయం మండలంంలోని అల్లూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సుమోటో క్యాష్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ వివరాలను, వెరిఫికేషన్ ప్రక్రియలో వస్తున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఓ సుబ్బారెడ్డి ఉన్నారు.

## లా అండ్ ఆర్డర్ ఐజిని కలిసిన జిల్లా ఎస్పీ దామోదర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ దామోదర్ శనివారం లా అండ్ ఆర్డర్ ఐ.జి సిహెచ్ శ్రీకాంత్‌ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం పలు విషయాలు మాట్లాడుకున్నారు.

# అర్‌అండ్‌బి పనులను త్వరగా పూర్తి చేయాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లాలో ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా చేపట్టి పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరెట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్ అండ్‌బి శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా చేపట్టి పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో అత్యవసరంగా చేపట్టవలసిన రోడ్డు మరమ్మతు పనుల ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని జిల్లా కలెక్టర్, ఆర్.అండ్‌బి శాఖ ఎస్.ఈను ఆదేశించారు. ఈ సందర్భంగా రహదారులు భవనాల శాఖ ద్వారా చేపడుతున్న ప్రతిపాదిత పనుల వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ఎస్.ఈ దేవానందం, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

# 'డొక్కా సీతమ్మ' ఉచిత అన్నదానం స్ఫూర్తిదాయకం

### 3వ రోజు అన్నదానాన్ని ప్రారంభించిన జనసేన దర్శి ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్



ఒంగోలు, మేజర్‌న్యూస్: జనసేన ప్రకాశం జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ జడ బాల నాగేంద్ర యాదవ్ నేతృత్వంలో ఒంగోలులో శ్రీమతి డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. శనివారంతో 3వ రోజుకు చేరుకున్న అన్నదాన కార్యక్రమాన్ని జనసేన దర్శి ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన్ని ప్రారంభించారు. అనంతరం గరికపాటి మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో డొక్కా సీతమ్మ పేరు మీదగా ఉచిత అన్నదాన కేంద్రాన్ని నడపడం గొప్ప విషయం అన్నారు. జడా బాలనాగేంద్ర యాదవ్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే మొదటిగా ఒంగోలులో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ జడ బాల నాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో నిత్య అన్నదాన కార్యక్రమాలు చేపట్టి పవన్ కల్యాణ్ ఆశయ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తే పేద ప్రజల ఆకలి తీర్చినవారివి అవుతామన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు కోలా ప్రభాకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు చేస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమం ఎంతో మంది పేదల ఆకలి తీరుస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో శీలంశెట్టి చంద్రశేఖర్, జీ. శ్రీనివాసరావు, పార్మ కోటయ్య, కోటా సుధాకర్, బిట్రగుంట పవన్, దర్శి నియోజకవర్గ మండల జనసేన నాయకులు పప్పుల పాపారావు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలపై సిఎం దృష్టి పెట్టాలి

### మీడియాతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ



ఒంగోలు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయని తక్షణమే ముఖ్య మంత్రి దృష్టి పెట్టాలని, అదే విధంగా వరదలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ప్రకాశం జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లా డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. పుంగనూరులో వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డి పై దాడి, సరికాదని గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులు ప్రస్తుతం టిడిపి చేస్తే వైసీపీకి టిడిపికి తేడా ఏమిటి అని ప్రశ్నించారు. పుంగనూరు లాంటి ఘటనలు మళ్లీ రాష్ట్రంలో చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి స్పందించాలని సూచించారు. వరద బాధితులకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అండగా ఉండా లని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 25కి నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించి నట్లు తెలిపారు. ఈసమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి. ఈశ్వరయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, సిపిఐ నగర్ కార్యదర్శి పివిఆర్ చౌదరి పాల్గొన్నారు

## గుంటూరు రేంజ్ ఐజిని కలిసిన జిల్లా ఎస్పీ దామోదర్

ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ దామోదర్ శనివారం గుంటూరు రేంజ్ ఐ.జి సర్వశ్రేష్ట త్రిపాఠిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



## పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలి



దర్శి, మేజర్‌న్యూస్: పచ్చదనం, పరిశుభ్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని దర్శి ప్రభుత్వ వైద్య శాల ప్రధాన వైద్య అధికారి డాక్టర్ సుమన్ కోరారు. డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో హాస్పటల్ నందు మొక్కలు నాటే కార్యకరమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పరిరక్షణ కోసం మనమందరం పాటుపడాలి అని అన్నారు. డాక్టర్ షేక్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుదల ఉండాలి అంటే ప్రతిమనిషి భాద్యతగా వారి ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలి అన్నారు. డాక్టర్ గీత పద్మ మాట్లాడుతూ చెట్లు చెట్లు నరకడం వలన వర్షాలు సరిగా పడవు అని అన్నారు. డాక్టర్ లక్ష్మి పూజిత, డాక్టర్ మోహన్ శివకుమార్, టీడీపీ ప్రకాశం మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాషువా వర్ధంతి సభ కరపత్రాలు ఆవిష్కరణ



దర్శి, మేజర్‌న్యూస్: తాసిల్దార్ కార్యాలయంలో రాష్ట్ర దళితసేన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 24న దర్శి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో మహాకవి కవికోకిల గుర్రం జాషువా 53వ వర్ధంతి సభ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రచార కరపత్రాలను స్థానిక డిప్యూటీ తాసిల్దార్ ఆకుల రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లాప్రధానకార్యదర్శి అన్నవరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ కేంద్రంలో జాషువా 53వ వర్ధంతి సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొంటారని తెలిపారు. గుర్రం జాషువా రచించిన పద్యాలను ఆలకించే కవులు, కళాకారులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పత్రిక ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు జి.ప్రేమ్ కుమార్, రాచపూడి మోషే, జూపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



దర్శి, మేజర్‌న్యూస్: సమాజంలోని ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కులు నాటాలని, మొక్కులను పెంచినట్లు అయితే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బి.జె.పి నాయకులు తిండి నారాయణ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న అమ్మ కోసం ఒక చెట్టు అనే కార్యక్రమంలో భాగంగా దర్శి పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల నందు మొక్కలను శనివారం నాటారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తిండి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లు రమణారెడ్డి, ఉపాధ్యాయురాలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంత ప్రజలను మెరక ప్రాంతాలకు తరలించాలి

### రేపల్లె ఆర్డీవో హేలా షారోన్





భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: కృష్ణానది విజయవాడ బ్యారేజ్ వద్ద 8 గేట్లు ఎత్తి 7వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదలడంతో కృష్ణా నది పరివాహక లంక గ్రామాలకు ముంపు ఏర్పడే పరిస్థితి ఉన్నదని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని పెదలంక సమీపంలోని కృష్ణా నదిరేవును ఆమె మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశాలలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.రెండు రోజుల్లో కృష్ణ నదికి నీటి ఉధృతి పెరుగుతుందని ఆమె తెలిపారు.పంచాయతీ రాజ్ శాఖ, విద్యుత్,వైద్య,పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు.వరద ముంపు గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను భట్టిప్రోలు లోనే తమన్న మల్లికార్జున ఉన్నత పాఠశాల, వెల్లటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,పెద పులిహోరలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వసతి భోజనం ఏర్పాట్లు చూడాలని ఆమె అధికారులకు సూచించారు.వరదల కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా, అదేవిధంగా పశు జాతిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలనిఆమె అధికారులకు సూచించారు.విద్యుత్ శాఖ వారు అప్రమత్తంగాఉండాలన్నారు.ప్రతి శాఖఅధికారులు,రెవెన్యూ శాఖకు అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు.మండల పరిధిలో ఎటువంటి అవసరాలు ఉన్న తనకు తెలియపరిస్తే జిల్లా కలెక్టర్ వారికి తెలియపరచనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఇన్చార్జి డిప్యూటీ తహసిల్దారు ఎం శ్రీనివాసరావు,సర్వేయర్ బి శ్రీనివాసరావు,ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు,విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొం డలు, ఇరిగేషన్ ఏయి రవిబాబు,పి ఆర్ ఏ ఈ రామచంద్రరావు,వీఆర్వోలు, పంచాయతీ కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది, ఫైర్స్ సిబ్బంది, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## కట్టా దీపక్ సౌజన్యంతో అన్నా క్యాంటీన్లలో అన్నదానం



ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలో ఎలక్ట్రికల్ డిఈ కట్టా వెంకటేశ్వర్లు కుమారుడు ఎన్ఆర్ఐ కట్టా దీపక్‌ల సౌజన్యంతో నాలుగు అన్న క్యాంటీన్లలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్, టీడీపీ నాయకులు సుబ్బారావు గుప్తా పాల్గొన్నారు. పేదలకు గుప్తా అన్నం వడ్డించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాను స్వయంగా భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తాను త్వరలో యంయం హెల్పింగ్ హ్యాండ్స్ చీరాల్లో ప్రారంభించి ఒంగోలులో కూడా బ్రాంచి ఆఫీస్ మొదలు పెడతానని ఆయన సుబ్బారావు గుప్తా తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోని అన్నా క్యాంటిన్లకు ఒక్కో లక్ష రూపాయిలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. తన స్వంత నియోజకవర్గమైన ఒంగోలుకు 4 లక్షల రూపాయిలు విరాళంగా అందజేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకుడు పువ్వాడ సుబ్బయ్య, టీడీపీ కూటమి నాయకులు అబ్బూరి వెంకట్రావు, దమ్మాల పాటిపాపారావు, వేమూరి కొండల రావు, కాపు సంఘం యువనాయకులు రావూరి బుజ్జి నాయుడు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గుప్తా అభిమానులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని మన్నేటికోట గ్రామంలో కుష్టు వ్యాధిపై కరేడు వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరికైనా శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు ఉన్నచో ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు చూపించాలని ఆయన సూచించారు. ఆ మచ్చలు ఏ రకమైన మచ్చల్లో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మం ఆగస్టు 2 తేదీ వరకు జరు గుతుం దని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మణెమ్మ, అల్తాఫ్, శోభ పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక విద్యార్థినులకు అవగాహన



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: సమాజంలో బాలికల సమస్యల పరిష్కారానికి విద్యతోనే సాధ్యమని విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నతస్థాయిలో రాణించాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ బాషా అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువులు విలువలు అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాలికలు సమస్యలను అధిగమించడానికి ఉన్నతవిద్య తప్పనిసరి అని పేదరికాన్ని జయించాలని కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో అన్నిరంగాల్లో రాణించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్య తనిచ్చి అన్ని వసతులు అందిస్తున్నట్లు బాలికలకు కెజిబివి పాఠశాలలు బాగా ఉపయోగపడుతున్నట్లు విద్యా ర్థినులు తమ లక్ష్యాన్ని అధిగమించి ఉత్తమవిద్యతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని అన్నిజాగ్రతలు తీసుకోవాలని సూచించారు. గయాజ్ బాషా బాలికల అభి వృద్ధికి పాడినపాటకు చప్పట్లు మారుమోగాయి. ఈ కార్య క్రమంలో జెవివి షేక్ గయాజ్ బాషా, ప్రముఖ సైకాల జిస్ట్ కెటిసి పాపారాయుడు, ఎంఇఓ ప్రసాదరావు, ఫణి, కెజిబివి ప్రత్యేక అధికారిణి షేక్ రేష్మా, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండల పరిషత్ కార్యాలయం వద్ద గల ఐసిడిఎస్ హాల్లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం 2005 పైన మండల స్థాయి అధికారులకు, గ్రామస్థాయి అధికారులకు, రైతులకు అవగాహన కల్పించడం జరిగినది. చట్టంలో ఉన్నటువంటి వాటిని చర్చించుకుని ప్రతి అధికారి ప్రజలకు పారదర్శకమైన విధులను నిర్వర్తించాలని అదేవిధంగా ఆఫీస్ నందు రికార్డులను సక్రమంగా పొందుపరచుకొని ప్రజలకు సమాచారం అందించుటలో సహకరించడం అవసరమని మండల వ్యవసాయ అధికారి ఐ.కాశీ విశ్వనాధ్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిఈపిఆర్ శేషయ్య మరియు డిటి మహేశ్వరి, ఏసిడిపిఓ సుచిత్ర, హార్టికల్చర్ ఆఫీసర్ అలేఖ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏఎంసి సెక్రటరీ రాణి, పీహెచ్సీ డాక్టర్ బాలరాజు, పంచాయతీ సెక్రటరీలు వీఆర్వోలు విఏఎలు, అసిస్టెంట్స్ ఆఫ్ఐ సిడిపిఓ స్టాఫ్ పాల్గొనడం జరిగింది.

## నేడు బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సంధర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధ్యక్ష, కార్యదర్సులు దేవకీ సుబ్రహ్మణ్యం ,పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావులు తెలిపారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు శాశ్వత ఉభయదాతలచే సామూహిక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 6 గంటలకు బాబా వారికి పుష్పాభిషేకం, రాత్రి 7 గంటలకు గుడి ఉత్సవం వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



## 22వ బెటాలియన్ కు విద్యార్థుల ఎంపిక

భట్టిప్రోలు,మేజర్ న్యూస్: భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 బ్యాచ్ కు సం బంధించి ఎన్ సి సి విద్యార్థులను శనివారం ఎంపిక చేసి నట్లు ప్రధాన ఉపాధ్యాయులు మాచర్ల మోహనరావు తెలి పారు.శనివారం జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కే.దాదిమ్మ ఆధ్వర్యంలో సుబేదార్ సేవా దేవ్, హవల్దార్ నాగరాజ్,హవల్దార్ అనంత్ ల పర్యవేక్షణలో ట్రూప్ నెంబర్ 401 తరపున 22వ బెటాలియన్ కు విద్యా ర్థుల ఎంపిక నిర్వహించారు.ఈ ఎంపికలో బాలికలు 20 మందిని బాలు రను 40 మందిని ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.



## స్కూల్ వాహనాల తనిఖీ

పొదిలి, మేజర్‌న్యూస్: పట్టణంలోని మార్కాపురం రోడ్డులో శనివారం స్కూల్ బస్సులు తనిఖీ చేసిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవికుమార్. ఫిట్‌నెస్ లేని నాలుగు బస్సులపై కేసు నమోదు చేసి రూ.50,000/-లు జరిమానా విధించి ప్రతి డ్రైవర్ కాకి యూనిఫాం తప్పనిసరిగా ధరించాలి స్కూల్ బస్సు లో సీట్ల పరిమితిలోనే పిల్లల్ని ఎక్కించాలి అని చెప్పిన రవికుమార్. అయినతో పాల్గొన్న సిబ్బంది.

## వ్యవసాయ పొలాల్లో కేబుల్ వైర్లతో ఇబ్బందులు



మద్రిపూడి మేజర్ న్యూస్: మండలంలోని కెల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం ఒంగోలు వయా పొదిలి హైవే ఆర్& బి రహదారి పక్కన 11కెవి విద్యుత్ లైన్ లకు కేబుల్ వైర్లు లాగడంతో వర్షాల కారణంగా కేబుల్ వైర్లు కిందకి జారి వేలాడుతూ ఉండడంతో రైతులు వ్యవసాయం కోసం పొలాల్లోకి ట్రాక్టర్లతో వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని అగ్రహారం రైతులు అన్నారు.ఒంగోలు వైపు నుండి పొదిలి వైపుకు వెళ్లే విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ కేబుల్ వైర్లు లాగడంతో వ్యవసాయ ట్రాక్టర్లకు ఇబ్బందికరంగా మారిందని ఆకేబుల్ వైర్లను తెంచేందుకు రైతులకు ఇష్టము లేక విలేకరులకు తెలియజేశారు. సంబంధిత కేబుల్ వైర్లు యజమాన్యం వెంటనే స్పందించాలని మద్రిపూడి మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రమేష్ చౌదరి తెలిపారు.



## శ్యాంబాబు మృతదేహం వెలికితీత

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వాసేపల్లి పాడు గ్రామానికి చెందిన నలమాలపు నవీన్, శ్యాంబాబు అనే ఇద్దరు యువకులు వల్లూరు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన తెలిసిందే. నలమాలపు నవీన్ మృతదేహం శుక్రవారం వెలికితీయగా శ్యాంబాబు మృతదేహం కోసం అగ్నిమాపక సిబ్బంది చెరువులు వెతికినప్పటికీ ఫలితం కానరాలేదు. శుక్రవారం రాత్రి ఆపరేషన్ రిస్కు ఆఫ్ చేయగా, శనివారం ఉదయాన్నే సింగరాయకొండ సిఐ రంగనాథ్, టంగుటూరు ఎస్సై పున్నారావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు సంఘటన స్థలానికి వెళ్ళగానే శ్యాంబాబు మృతదేహం నీటి పైన తేలియాడుతూ కనిపించడంతో శ్యాంబాబు మృతదేహాన్ని వెలికి తీశారు. శ్యాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకి శ్యాంబాబు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని రెండవ ఫీడర్‌లో చెట్లు కట్టింగ్ కారణంగా మెయింటినెన్స్ నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుండి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్ర ఏరియా, వెన్నెల అపార్ట్మెంట్ ఏరియా, పామూరు రోడ్ కొత్తూరు, ఉప్పురోడ్డు, బొడ్డు చావిడి, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, అర్బన్ కాలనీ, టకారిపాలెం ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు .కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఆరోపణలు అవాస్తం

### టిడిపి పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దుస్





పొదిలి, మేజర్ న్యూస్: శుక్రవారం సాయంత్రం షేక్ మునీర్ బాషా తన తల్లి షేక్ ఖమరున్నిసా బేగం మీడియా సమావేశం ఏర్పాటు చేసి పొదిలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు ముల్లా ఖుద్దుస్ వారి పిల్లలు, వారి వర్గం కలిసి తమ మీద దాడి చేసారని ముల్లా ఖుద్దుస్ వాళ్ళ పిల్లలు నుండి వారి వర్గం నుండి తమకు ప్రాణహాని ఉందని అకారణంగా తమ పై దాడులు చేస్తూ చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని షేక్ మునీర్ బాషా,తన తల్లి ఖమరున్నిసా బేగం పలు ఆరోపణలు చేశారు.ఈ వార్తలపై స్పందించిన పట్టణ టీడీపీ అధ్యక్షులు ముల్లా ఖుద్దుస్ శనివారం సాయంత్రం పత్రిక సమావేశం ఏర్పాటు చేసి, నిన్న తమపై షేక్ మునీర్ బాషా, వారి తల్లి షేక్ కమురున్నిసా బేగం చేసిన ఆరోపణలు అవాస్తవమని, తాము తమ కుటుంబం చేతనైనకాడికి అందరికి మేలు చేస్తాం కానీ ఎవరికి హాని చేయమని, షేక్ మునీర్ బాషా వారి వర్గం వాళ్ళు తమ వారిపై చేసిన దాడులను వీడియో, ఫోటోలు రూపంలో చూపిస్తూ ఆరోపణలను ఖండించారు.అంతేకాకుండా మునీర్ బాషా, షాకీర్, రఫీ, గౌస అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి,దౌర్జ్యనంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, భూ కబ్జాలు చస్తున్నారు అని తగిన బాధితులు అన్నారు.ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ ఆవేదన మీడియా ముందు ఆధారాలతో తెలియచేయడం గమనార్హం.ఈవిషయం పై త్వరలో మన నాయకుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ద్వారా నారా లోకేష్ ని ప్రజాదర్బర్ లో కలిసి విన్నావిస్తామని,హెూమ్ మినిష్టర్ వంగలపూడి అనిత దృష్టికి కూడా తీసుకుపొదలుచుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఖుద్దుస్ వారి కుటుంబసభ్యులు, భాదితులు, మండలం మైనారిటీ నాయకులు ముల్లా ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యపనుల్లో అలసత్వం వద్దు



బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం అధ్వానంగా తయారైందని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ ముమ్మరంగా చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు.

సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం సింగరకొండ మీడియాతో మాట్లాడుతూ వర్షాలు దాటికి జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామాల్లో వర్షం నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. దీంతో నిలిచిన వర్షపు నీరు మురుగునీరుగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వలన చెత్తాచెదారం కుళ్ళి దుర్వాసన వస్తున్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ప్రజలు జ్వరాలతో పలు రోగాలతో అల్లాడుతున్నారని తెలిపారు. వర్షం ముసురు దాటికి దోమలు విపరీతంగా పెరిగిపోయాయని సాయంత్రమైతే ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయన్నారు.

దోమల కాటుకు ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాల బారినపడుతున్నారని చెప్పారు. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు చేశారు. జిల్లాలో బ్లీచింగ్ చల్లించటం అంతంత మాత్రంగానే ఉందని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ ఆయిల్ బాల్స్ వంటివి చేపట్టకపోవడం వలన దోమలు ఉధృతి అధికంగా ఉందన్నారు. అధికారులు సక్రమమైన ప్రణాళిక లేకపోవడం వలన ప్రజలకు శాపంగా మారి రోగాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు వివరించాలని సింగర్ కొండ తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో ప్రజలు అనారోగ్యం పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపల్ పంచాయతీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ప్రతిరోజు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు.

## 25 వరకు డిగ్రీలో అడ్మిషన్లకు గడువు

దోర్నాల, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఈ నెల 25వ తేదీవరకు అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డా.యస్.సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బి.ఏ (పొలిటికల్ సైన్స్), బి.కాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బియస్సీ (కంప్యూటర్ సైన్స్), బియస్సి (బోటనీ, హార్టికల్చర్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత సంవత్సరం జరిగిన యూనివర్శిటీ ఫలితాలలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. తదుపరి మాట్లాడుతూ బోధనా పరంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు సాధించిన అధ్యాపకులు భోధిస్తున్నారు అని తెలిపారు. చివరగా ఈ సదవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులు వినియోగించుకొని తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు.

## అధిక వర్షాలకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బాపట్ల, మేజర్ న్యూస్: జిల్లాలో గత రెండు, మూడు రోజుల నుంచి అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో వేసిన వెద వరిలో తీసుకోవాల్సిన జాగ్రతలను ఏరువాక కేంద్రం, బాపట్ల కో-ఆర్డినేటర్ డా౹౹ ఆర్.బాల మురళీధర్ నాయక్ ఈ క్రింది విధంగా వివరించారు.వెద వరి విత్తుకొని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించినట్లయితే మొలక రావటానికి అవకాశముంది.వెద వరి విత్తన 10 నుంచి 30 రోజులైన పొలాల్లో నిల్వనీటిని తీసివేయాలి.వర్షాలు తగ్గిన తర్వాత ఎకరానికి ఒక బస్తా డి.ఎ.పి., 25 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి.వర్షాలు తగ్గిన తర్వాత వెదవరి విత్తన 15 నుంచి 20 రోజులైన పొలాల్లో 100 మి.లీ బిస్పైరిబాక్ సోడియం 10% లేదా టైయఫామోన్‌ఇథాక్సిసల్ప్యూరాన్ 30% డబ్ల్యు జి మందును ఏ 90 గా/ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరా పొలంలో కలుపు నివారణకు పిచికారి చేసుకోవాలి.వర్షాలు తగ్గిన తర్వాత వెదవరి విత్తిన 25 రోజులు నుంచి 30 రోజుల మధ్యలో 8 గ్రా మెట్సల్ఫ్యూరాన్ మిథైల్ క్లోరిమురాన్ మందును 8గ్రా౹ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి కలుపు నివారణకు పిచికారి చేయాలి అని జిల్లా రైతులకు బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ అడ్వైజరి ట్రాన్స్ఫర్ ఆఫ్ టెక్నాలజీ సెంటర్ అధికారి బాల మురళీధర్ నాయక్ తెలియజేశారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

చీరాల, మేజర్‌న్యూస్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రతినిధి లక్ష్మణ్ అన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం సబ్ స్టేషన్ 3 పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భిణీలు, బాలిం తలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే స్టేషన్లో ఉన్న రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రతినిదులు మాట్లాడుతూ గర్భిణీల స్థితిగతులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రధాన మంత్రిశ్రీ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకచర్యలు తీసుకుం టున్నట్లు ఎంఇఓ ఆర్.కొండారెడ్డి అన్నారు. పియంశ్రీ పాఠశాలకు ఎంపికైన సి.ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వసతులు విద్యాబోధన పరిశీలించి ఉపాధ్యా యులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పియంశ్రీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పియంశ్రీ నిధులతో పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, ఫర్నీచర్, ల్యాబరోటరీ, కంప్యూటర్ ల్యాబ్, స్మార్ట్ తరగతి గదులు, క్రీడామైదానం అభివృద్ధి, గ్రంధాలయం ఏర్పాటు తదితర వసతులు సమకూర్చుకునేందుకు ఉపయోగించుకుని పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు అన్నివసతులు కల్పించవచ్చని పియంశ్రీ నిధులు పాఠశాలఖాతాలో జమచేయబడు తుందని మన పాఠశాల ఎంపిక కావడం మనందరికి గర్వకారణం అని అందుకనుగుణంగా ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు వచ్చేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యార్థులు పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఎంఇఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నిసాబేగం, సీఆర్పీ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు రెడ్ క్రాస్ మెరుగైన సేవలు అందించాలి

### బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రజలకు సేవలను అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రకాశం జిల్లా శాఖ తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరెట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో సమావేశమై, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చేపడుతున్న సేవలు, కార్యక్రమాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలను అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా శాఖ తన వంతు తోడ్పాటు అందించాలన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రకాష్ బాబు, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చేపడుతున్న సేవలు, కార్యక్రమాలను గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ రూపొందించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డా. సి. వేంకటేశ్వర రెడ్డి, కార్యదర్శి, సెట్నెల్ సిఈఓ లోకేశ్వరరావు, ట్రెజరర్ రాఘవయ్య, సొసైటీసభ్యులు పాల్గొన్నారు.

## ఒంగోలు పాల కేంద్రాన్ని పున: ప్రారంభించాలి

### మూత వేసిన పాల కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ బృందం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రజల సొమ్మును గత ప్రభుత్వం అమూల్ పాల డైలీగా మార్చి రైతుల సొమ్ము, కార్పోరేట్ యాజమాన్యానికి దారాదత్తం చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. శనివారం సిపిఐ బృందంతో డెయిరీని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి దీనిపై ఎంక్వయిరీ చేయించి డైరీ మరల పూర్వ వైభోగం వచ్చేలా చేసి రైతన్న ఆదుకోవాలన్నారు. తద్వారా జిల్లాలో కొంతవరకు నిరుద్యోగులకు భృతి కలుపుతుందన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రికు కలుస్తామని, ఆసియా ఖండంలోనే, అతిపెద్ద దైన పాలపొడి ఫ్యాక్టరీ, కోట్ల రూపాయలు అయ్యే యంత్రాలను, నిరుపయోగంగా పడేయటం సరికాదని గతంలో ఫ్యాక్టరీలో పనిచేసిన ఉద్యోగుల బకాయిలు పాలు రైతుల బకాయిలు అన్నీ కూడా చెల్లించాలన్నారు. అవసరమైతే రాష్ట్రస్థాయిలో కలిసి వచ్చే పార్టీలని వివిధ సంఘాలని కలుపుకోవాలన్నారు. డైరీ పునరుద్ధరణ కొరకు ఆందోళనలు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి ఎంఎల్ నారాయన, పార్టీ సీనియర్ నాయకులు ఉప్పుటూరు ప్రకాశం, నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాస్, కెవి కృష్ణ, గౌడ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కే. వీరారెడ్డి, కందుకూరి సుభానాయుడు, కొత్తకోట వెంకటేశ్వర్లు, నూనె మోహన్రావు, తదిరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో భారతదేశం

– పేదలకు అండగా కమ్యూనిస్టులు

– జాతీయ, ప్రాంతీయ పార్టీలు కార్పోరేట్ తొత్తులు

– సిపిఐ జిల్లా సర్వసభ్య సమావేశంలో

రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ




ఒంగోలు, మేజర్‌న్యూస్: దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల అందరం కలిసి, మెలసి ఉంటున్నామని అలాంటి రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేసి కులాలు, మతాలు, మధ్య చిచ్చుపెట్టి, హిందూ మతోన్మాదాన్ని పెంచి పోషించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కులాలు -మతాలు ప్రాంతాల- మధ్య చిచ్చు పెట్టి, బిజెపి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. దీన్ని గుర్తించిన ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి బలాన్ని 62 సీట్లు కు తగ్గించారని అన్నారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ప్రాంతీయ పార్టీల మద్దతుతో మూడోసారి మోదీ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ ,ఎన్డీఏ కూటమిలో కలవకపోతే దేశ రాజకీయాలు మరోలా వుండేవని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కేవలం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి భయపడే ఎన్డీఏలో చేరారని తెలిపారు. మోదీ ఇప్పటికే దేశ సంపదను ఆదాని, అంబానీ లాంటి కార్పోరేట్ శక్తులకు దోశ పెట్టారని ఆవేదనతో చేశారు. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు కేవలం కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడతయే తప్ప పేద, బడుగు , బలహీన వర్గాలు, ఉద్యోగ, కార్మిక, వర్గానికి అండగా ఉండవని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ సిపిఐ శత జయంతి ఉత్సవాలను వాడ,వాడలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వైఫల్యాలు విద్వేష, రాజకీయాలను ఎండ కట్టేందుకు వామపక్షాలతో పాటు ,లౌకిక పార్టీలు సమయతనవుతున్నాయని తెలిపారు, 10 ఏళ్లగా ఎన్డీఏ ప్రభుత్వం పేద వర్గాలకు చేసింది ఏమీ లేదన్నారు, మరోపక్క దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలు జరగబోతున్న నేపథ్యంలో మన త్యాగాలు, మన పోరాటాలను, ప్రజలకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దీనిపై పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా జిల్లాలో త్రాగు, సాగునీరు ప్రజలు అందాలని జిల్లాలో అపరిస్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ స్థానిక సమస్యలపై పార్టీ నాయకులు దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న )సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, అందే నాసరయ్య ,సిపిఐ నగర్ కార్యదర్శి పివిఆర్ చౌదరి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి విజయ, తదితరులు పాల్గొన్నారు

## మానసిక బలహీనులు

వందకి వంద శాతం నిఖార్సయిన మనిషి ఉండడు. ఖచ్చితంగా వారికి ఏదో బలహీనత ఉంటుంది. ఆ బలహీనత అతనిని లేదా అతని లక్ష్యాన్ని లేదా జర్నీని దెబ్బ తీసేదయితే ఆ బలహీనతను నూటికి నూరుపాళ్ళు నాశనం చేయవలసినదే. అదెలాగంటే మనం గట్టిగా మనసులో అనుకుంటే అది ఖచ్చితంగా పోతుంది.

**బలహీనతలకు గండి కొట్టాలి....**

మంచి వయసులో పిల్లలు చదువుకొని ప్రయోజకు లయ్యే దశ. ఈ దశలో ఉక్కిరి బిక్కిరి చేసే అనేక బలహీనతలు. లొంగిపోయామా... జీవితం నాశనం. ఆ నాశనం అన్న విషయం అప్పుడు తెలియదు - ఓ పదేళ్ళ తదుపరి ప్రశాంతంగా తెలుస్తుంది. ఆది దశలోనే మనం మన బలహీనతలకు గండి కొడితే అది ఉప్పెన మాదిరి అయి అందులో మనం కొట్టుకు పోకుండా ఉంటాం.

**తల్లిదండ్రులూ కారణమే...**

ముఖ్యంగా పిల్లలు చెడిపోతున్నారు అంటే నాకు తెలిసిన మేరకు కారణం మొదటి మెట్టు తల్లిదండ్రులు. వారికి చెందిన అతిప్రేమ. ఈ అతి ప్రేమను జనాలు చూస్తున్నారని చూపిస్తారో? మరి సహజ సిద్ధంగా ఉండే ప్రేమను చూపిస్తారో తెలియదు గాని దీనితో పిల్లలను చెడగొట్టడం ఖాయం. ఈ రోజుకి చాలామంది తల్లిదం డ్రులకి తమ బిడ్డకు ఏదిష్టమో, ఏ కోర్సు ఇష్టమో కూడా తెలియదు. ఆ! డబ్బులున్నాయి, వారే చదువుతారు, మరో కాలేజీలో చేర్పిస్తే సరి! వాళ్ళని, వీళ్ళని చూసి చదువుకొని బాగుపడతారులే... అనుకుంటారు. కానీ అది జరగదు. డబ్బులుపోతాయి. విలువైన కాలం పోతుంది, పిల్లల కెరీర్ కూడా పోతుంది. కనుక తల్లిదం డ్రులు ఈ బలహీనతను జయించాలి.

**యుక్త వయస్సులో జాగ్రత్త.....**

ఇక యుక్త వయస్సు నాటికి అనేక సమస్యలు చుట్టు ముడతాయి. కొన్ని గోప్యంగా ఉండాల్సిన అంశాలు కూడా ఉంటాయి. వాటిని బహిరంగ పరచవలసిన అవ సరం లేదు. కాలానుగుణంగా అవి జరిగిపోతుం టాయి. కానీ నేటి సామాజిక మాద్యమాలు వానిలోని గోప్యతను బట్టబయలు చేస్తున్నాయి. దీనివల్ల పవిత్రత అనే పదం పోయి పాపం మూట కట్టుకోవల సిన పరిస్థితి. దీంతో సినిమాల్లోలాగా, టీవీ సీరియళ్ళలాగా, వెబ్ సీరీస్‌లో లాగా ఓటీటీల్లాగా జీవితం ఉంటుందని అభంశుభం ఎరుగని పిల్లలు వాటిపట్ల ఆకర్షితులు అయి తరువాత తనువులు చాలిస్తు న్నారు. కనుక ఇక్కడ కూడా తమ బిడ్డలకు తెలియకుండా తల్లిదండ్రులే కొంత కాలం సిఐడి పాత్ర పోషించవలసి ఉంది. ఒకటికి రెండుసార్లు చెక్‌చేసుకోవాలి, ధృవీకరించుకోవాలి. అపుడే వారిని గాడిన పెట్టిన వారమవుతాం. ఎవరి బిడ్డలు వారికి ప్రాణం, ప్రేమ.. ఇది నిజమే. కానీ రేపు ఆ ప్రాణాలే పోతే?



**కోపాన్ని జయించాలి....**

ఇక నేడు మనం అందరం ఎదుర్కొంటున్న అతిపెద్ద బలహీనత కోపం. మనిషికి సమస్యలు ఎక్కువయిన పుడు, లేదా పని ఒత్తిడి తీవ్రం అయినపుడు కోపం వస్తుంది. కానీ కోపం వచ్చినపుడు మనమందరం చూడ టానికి అసలు బాగోము. మీరు కోపంగా ఉన్నపుడు ఒకసారి అద్దంలో చూసుకోండి. ఎంత అసహ్యంగా ఉంటామో! అవునా? కాదా? కనుక మనకు కోపం వస్తుంది అని తెలుసుకునేలోపే విచక్షణ, విజ్ఞానంతో దాని పీక పిసికేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అంటే సర్వకాల సర్వావస్థలందు కోపం పనికిరాదు. కోపం మనకీ మంచిది కాదు. ఎదుటివాళ్ళకీ మంచిది కాదు. దీనివల్ల సంబంధాలు దెబ్బతింటాయి. విపరీతమయిన కాల హరణం అవుతుంది. పనికి మాలిన హడావుడి, బీపీలు, షుగర్‌లు పెరగడం తప్ప ఏముంటుంది కోపంలో. కనుక కోపం అనే నరాన్ని తెంపేయండి. అలాగని గోవులా ఉండమని కాదు. మన హక్కు అన్నపుడు పోరా డవలసిందే. ఈ కోపం అవసరమే! కానీ ప్రతిదానికి కోపం అనే ఆయుధం వాడితే కోపిష్టి, ముక్కోపి అనే పదాలు ప్రాచుర్యం పొంది మన దగ్గరకు వచ్చేవారు ఒక పద్ధతి ప్రకారం దూరం అవుతారు.

**జిహ్వా చాపల్యం తగ్గించుకోవాలి...**

మనలోని మరో బలహీనత ఏదిపడితే అది తినేయడం. రోడ్డుపై మనం వెళ్తున్నపుడు వేడివేడి నూనె లలో మరుగుతున్న మిర్చీలు, పునుగులు, గారెలు ఇలాం టివి ఆకర్షించినంతగా అదే రోడ్డుపై ఉండే ఫ్రూట్స్ ఆకర్షించవు. వీటికి పెట్టే ఆ పది రూపాయలు పండ్లకి పెడితే పోషకాలు వస్తాయి. కానీ నాలిక బలహీనత వల్ల ప్రాణం బజ్జీల వైపే పీకుతుంది. తినేదాక ఆగదు. ఆ తరువాత ఇదే పద్ధతి కొనసాగించడం వల్ల ఫ్యూచర్‌లో ఎక్సరేలు, హాస్పిటల్స్ తప్ప మరేమీ కానరావు. నిజానికి నేడు మనం మనకు కావలసిన కేలరీల కన్నా ఎక్కువ కేలరీల ఫుడ్ లాగించేస్తున్నాము. రుచి అనేది నాలిక చివరి వరకే. మిషన్‌లోకి పోయిన తరువాత అంతా ఒకటే. కనుక మిర్చి కొనాలా? మ్యాంగో కొనాలా? అనేది మన విచక్షణ. ఎవరూ ఎవరినీ ఇక్కడ బలవంతం పెట్టరు కదా! మనిష్టం. రేపటి మన కర్మకు ఇది ఇష్టం.

**ఎదుటివారిని చులకనగా చూడవద్దు....**

మరి కొంతమందికి ఎదుటివారిని ఏడిపించే బల హీనత. ఎదుటివారి ఏడుపులో వీరు సంతోషం వెతుక్కుం టారు. ఇదొక మాయరోగం. ఇలాంటి వారు ఎదుటి వారి బలహీనతలను చెప్పుకుంటూ, పదే పదే జనాల్లో వారిని చులకన చేస్తూ అదో స్కీం లాగా పనిచేస్తూ ఉంటారు. మరి వీళ్ళు ఎలా బతుకుతారు? ఏ పని చేసి బతుకుతారు? అంటే, బేసికల్లీ వీరు పరాన్న జీవులు. పారాసైట్స్. ఇంట్లో ఎవరో ఒకరు గొడ్డుచాకిరి చేస్తూ సంపాదిస్తుంటే ఆ డబ్బులతో దేశం పై బడి ఇలా ఎవరినో ఒకరిని ఏదో ఒకటి కామెంట్ చేస్తూ బతికే స్తుంటారు. కొన్నాళ్ళకి వీళ్ళకి పిచ్చి పట్టిందని జనాలు దూరం పెడతారు. ఆ తరువాత వారికి నిజంగానే పిచ్చి పడుతుంది. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదుటివారి గురించి చులకన చేయటం గాని చులకనగా చూడడం కానీ చేయవద్దు. ఇందాక మనం చెప్పుకున్నట్లే ఇదొక మాయరోగం. మరికొంతమంది తాము మానసికంగా అపర బల వంతులమని చెప్పుకుంటారు. ఇది కూడా ఒక రకంగా బలహీనతే. అస్సలు మనలను మనం ఎక్కువగా అంచనా వేసుకుంటాం. ఒకటేమిటి? అన్ని రకాలు గానూ. అంచనాలను రీచ్ కాలేక దుఃఖం ఒడిలోకి చేరి పోతాం. ముందు మనమేంటో మనకు తెలియాలి. వేరే వారికి కానే కాదు. వేరేవారికి మనబలం, బలహీనతలు తెలుస్తున్నాయంటే మన పరిస్థితి శృతి మించినట్లేనని గుర్తించండి. తక్కున మనం మారాలి. మార్చుకోవాలి. లేదా పదిమందిలో అల్లరయిపోము? మనకి ఎంత తెలిసినా, ఎదుటివారికి ఎంత తక్కువగా తెలిసినా, మనం వినాలే కానీ డాంభికం వద్దు. ఎందుకు వినాలి? అని మీరు అడగవచ్చు. వినాలి అంతే. లేదా అక్కడికి వెళ్ళవద్దు. దూరంగా ఉండండి.

మనం ఇలా అనుకోవాలి- మనం గొప్పవాళ్లం కాదు. కానీ గొప్ప వాళ్ళం అవడానికి ప్రయత్నించాలి. అలాగే మనం మేథావులం కాదు, కానీ మేథావులు కావడానికి యత్నించాలి. బేసికల్‌గానే మనం మంచివాళ్ళము కాదు, మంచివాళ్ళలాగా కావడానికి ప్రతిరోజూ ప్రయత్నిస్తూనే ఉండాలి. రూసో అనుకుంటాను...ఆయన ఎక్కడో ఇలా అన్నారు.

“మనుషులందరూ చెడ్డవాళ్ళే! అవకాశం రాక మంచివారిగా మిగిలిపోతు న్నారు”. నేనంటా ను మనుషు లందరూ మంచి వాళ్ళే అవకాశం వచ్చి చెడ్డవాళ్ళుగా మారుతున్నారు!!